Follow: @ANNTELUGU

21-09-2026

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 242 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత

**మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులు**

**నాడు ఎమ్మెల్యే టికెట్ మిస్.. నేడు జిల్లా కాంగ్రెస్ బాస్**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం దిశగా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మూడు జిల్లా కాంగ్రెస్ కమిటీలకు (డీసీసీ) నూతన అధ్యక్షులను నియమించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత నరసింహారెడ్డిని నియమించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుబట్టినా అనూహ్యంగా ఆఖరిక్షణంలో టికెట్ మిస్ కాగా, ఇపుడు ఏకంగా జిల్లా కాంగ్రెస్

**మిగతా 3వ పేజీలో**

**టాప్ న్యూస్**



### ఎల్‌నినోని సవాల్‌గా తీసుకుందాం

- ఏపీ సీఎం చంద్రబాబు
- రైతులకు నష్టం రాకుండా కార్యాచరణ

03



### లోకల్ వార్ కు జనసేన రెడీ

- కందుల దుర్గేష్ కు ఎన్నికల బాధ్యతలు

03



### ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం ఖాయం

- కేంద్రమంత్రి బండి సంజయ్

03

# ఎమ్మెల్సీ రేసులో..

## గవర్నర్ కోటాలో సత్తు మల్లేష్, హర్కరి వేణుగోపాల్, షబ్బీర్ అలీ ?

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ల కోసం పోటాపోటీ

### నల్లగొండపై గుత్తా అమిత్..

### హైదరాబాద్ రంగారెడ్డిపై వేణుగోపాల్ రెడ్డి ఆశలు

### ఒక్కో సీటుకు పదిమంది ఆశావహులు



**హైదరాబాద్, మహా :**

నవంబర్ లో ఖాళీకానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నవంబర్ 14తో బొగ్గారపు దయానంద్, గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య పదవీకాలం ముగియనుండగా, సారయ్య మరోసారి రెన్యువల్ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్టానం దీనికి సానుకూలంగా లేదు. సారయ్యకు రెన్యువల్ చేయాల్సి వస్తే ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన బొగ్గారపు దయానంద్ కు కూడా చేయాల్సి ఉంటుందని, కాంగ్రెస్ పార్టీలో అలాంటి ఆనవాయితీలేదని కాంగ్రెస్ పెద్దలు తేల్చిచెప్పినట్లు సమాచారం. ప్రత్యామ్నాయంగా మరేదైనా చూస్తామని చెప్పినట్లు తెలిసింది. ఇక గవర్నర్ కోటాలో ప్రధానంగా బీసీ సామాజికవర్గం నుండి సత్తు మల్లేష్ పేరు వినబడుతోంది. మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన సత్తుమల్లేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన అనుచరుల్లో ఒకరిగా ఉన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి అవసరమైన సందర్భంలో

**మిగతా 3వ పేజీలో**



# జోడిమెట్లలో ఆగని అక్రమ షెడ్ నిర్మాణం..!

## జాతీయ రహదారి పక్కనే నిబంధనలకు తూట్లు..!

## ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు శూన్యం..!

### అక్రమ షెడ్ వెనుక ఎవరి అండదండలు...!

- అధికారులకు సవాల్ విసురుతున్న అక్రమార్కులు..!
- టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నట్లా.. లేనట్లా..?
- నిద్రమత్తులో డిప్యూటీ కమిషనర్....!
- స్పెషల్ టాస్క్ ఫోర్స్ రంగంలోకి దిగాల్సిందేనంటున్న స్థానికులు....!
- జోనల్ కమిషనరైనా స్పందించేనా ...!

**మహా, సిటీ బ్యూరో :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ జోడిమెట్ల పరిధిలో హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి పక్కన తాజా కిచెన్ ఎదురుగా నిర్మిస్తున్న భారీ కమర్షియల్ అక్రమ షెడ్డు నిర్మాణం వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్, టౌన్ ప్లానింగ్ చట్టాలను బేఖాతరు చేస్తూ అక్రమార్కులు రేయింబవళ్లు యదేచ్ఛగా నిర్మాణ పనులు కొనసాగిస్తుంటే, పర్యవేక్షించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా, పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ నిర్మాణదారులు మరింత రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వార్తలు వచ్చినప్పుడే విరామం... ఆ తర్వాత మళ్లీ అదే తంతు..!**

జోడిమెట్లలో వెలుస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణంపై

**మిగతా 2వ పేజీలో**



### తెలంగాణకు వర్ష సూచన

వారం రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షా లు

03

నిజాం ఆస్తుల కంటే

### కేసీఆర్ కుటుంబ ఆస్తులే ఎక్కువ

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

03



# కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా బహుజనుల బాణాన్ని



- బహిరంగసభలో కవిత
- పెద్ద ఎత్తున హాజరైన జనం.. భారీ ర్యాలీతో సభకు

**కొడంగల్, మహా :** ''కాంగ్రెస్ విడిచిన బాణమని బీఆర్‌ఎస్ వాళ్లు.. కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు.. భాజపా బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న తెలంగాణ బహుజనుల బాణాన్ని నేను. తెలంగాణ యువజనుల యుద్ధ నినాదాన్ని.. అంబేడ్కర్ వాదాన్ని.. మహాత్మ జ్యోతిబా పులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను. మీరు ధైర్యమిస్తే.. ఒక మహిళ

**మిగతా 3వ పేజీలో**



తెలంగాణ వార్ రూమ్ నుంచి

### ఢిల్లీ జాతీయ వార్ రూమ్ వరకు

- కులగణనపై కాంగ్రెస్ 100 రోజుల జాతీయ క్యాంపెయిన్‌కు రుద్ర సంతోష్ కుమార్ కీలక బాధ్యత
- తెలంగాణలో బూత్ స్థాయి సమన్వయ అనుభవానికి జాతీయ స్థాయిలో గుర్తింపు

03



హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్-8 లెజెండ్ అపార్ట్మెంట్ ఎదురుగా

# రెసిడెన్షియల్ భవనంలో వాణిజ్య దందాకు సన్నాహాలు ..!

## అనుమతులు లేని కమర్షియల్ నిర్మాణం..!

02

- నివాస సముదాయాన్ని వాణిజ్య కేంద్రంగా మార్పు..!
- మచ్చుకైనా కనిపించని సెట్‌బ్యాక్‌లు..!
- అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు....!
- అసలే అక్రమ నిర్మాణం.. ఆపై మూడో ఫ్లోర్ లో భారీ షెడ్డు....!
- హబ్సిగూడ స్ట్రీట్ నెం.8 లో వెలుగుచూసిన వైనం..!



గతంలో ఉన్న రెసిడెన్షియల్ భవనం (ఫైల్ ఫోటో)

# జోడిమెట్లలో ఆగని అక్రమ షెడ్ నిర్మాణం..!

(మొదటి పేజీ తరువాయి)

స్థానికుల నుండి ఫిర్యాదులు అందిన ప్రతిసారి అధికారులలో కదలిక వచ్చినట్లు నటిస్తున్నారు. అది కేవలం 'నటనకే' పరిమితమవుతోందని స్థానికులు బహిరంగానే విమర్శిస్తున్నారు . పత్రికల్లో కథనాలు ప్రచురితమైన వెంటనే టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో కొంత హడావుడి చేయడం, నిర్మాణ పనులను రెండు మూడు రోజుల పాటు నిలిపివేయించడం, పరిస్థితి కాస్త చల్లబడగానే నిర్వాహకులను టౌన్ ప్లానింగ్ అధికారులే పనులు చేసుకోమంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.అక్రమ షెడ్డు నిర్మాణంపై కనీసం చట్టబద్ధమైన నోటీసులు కూడా జారీ చేయకపోవడం అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోందని, అధికారుల హెచ్చరికలు, తనిఖీలు కేవలం 'తూతూ మంత్రం'గా మారిపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణదారులతో అధికారులు కుమ్మక్కయ్యారా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారా? లేక మామూళ్ల మత్తులో జోగుతున్నారా? అనే తీవ్ర సందేహాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

**టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నట్లా... లేనట్లా..?**

అక్రమ నిర్మాణాల నియంత్రణ బాధ్యత వహించే టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్న మార్పులు చేసినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, ఈ భారీ నిర్మాణం విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అక్రమంగా నిర్మితమవుతున్న భారీ కమర్షియల్ షెడ్డు నిర్మాణంపై ఘట్కేసర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానికంగా అనేక ఫిర్యాదులు వెల్లువెత్తినా, పూర్తి ఆధారాలతో ఫొటోలు, వీడియోలు సమర్పించినా, వార్త పత్రికలలో వార్తా కథనాలు ప్రచురించినా, క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమ షెడ్డును అడ్డుకోవడంలో, శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో టౌన్ ప్లానింగ్ విభాగం ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .

**అక్రమ షెడ్ వెనుక ఎవరి అండదండలు..?**

సాధారణంగా ఫిర్యాదు అందితే వెంటనే చర్యలు తీసుకునే అధికారులు, ఈ షెడ్డు వ్యవహారంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జాతీయ రహదారి పక్కనే అంత పెద్ద షెడ్ వెలుస్తున్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ నాయకుల, లేదా ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. "మా వెనుక ఎవరున్నారో చూసుకోండి.. మమ్మల్ని ఎవరేం చేయలేరు" అన్నట్లుగా అక్రమార్కులు యథేచ్ఛగా పనులు కానిచ్చేస్తున్నారని, అక్రమ నిర్మాణదారుల వెనుక బడా బాబుల హస్తం ఉండటం వల్లే అధికారులు కూడా చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి .

**నిద్రమత్తులో డిప్యూటీ కమిషనర్ ..?**

అక్రమ నిర్మాణాల నియంత్రణలో కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ 'వాణి' స్పందన ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారి పక్కనే నిబంధనలకు విరుద్ధంగా ఇంత పెద్ద భారీ కమర్షియల్ షెడ్ వెలుస్తున్నా, అనేక ఫిర్యాదులు, వార్తలు వస్తున్నా మేడమ్ గారికి పట్టినట్లు కూడా లేకపోవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణం పూర్తిస్థాయిలో అడ్డుకోవడంలో, నిర్మాణ పనులు నిలిచిపోయేలా కఠిన చర్యలు తీసుకోవడంలో డిప్యూటీ కమిషనర్ పూర్తి వైఫల్యం చెందారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ కమిషనర్ వాణి నిద్రమత్తు వీడి, తక్షణమే అక్రమ షెడ్లు, నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ మళ్లీ రంగంలోకి దిగాల్సిందే..!**

గతంలో ఒకసారి తాజా ఇదే జోడిమెట్ల పరిధిలో తాజా కిచెన్ పక్కనే అక్రమ షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకుని, కూల్చివేసి, సీజ్ చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరోసారి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పుడు కూడా అక్రమ షెడ్డు నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయనివారు అభిప్రాయపడుతున్నారు.

### జోనల్ కమిషనరైనా స్పందించేనా..?

స్థానిక అధికారుల వైఫల్యం, పదేపదే వస్తున్న ఫిర్యాదులు, పత్రికా కథనాలు, ప్రజల ఆందోళనల నేపథ్యంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ 'రాధికా గుప్త' స్వయంగా రంగంలోకి దిగాల్సిన అవసరం ఏర్పడిందని, జోనల్ కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేపట్టి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.అక్రమ షెడ్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ ఉన్నతాధికారులు కూడా ఈ వ్యవహారంపై స్పందించకపోతే, జోడిమెట్లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అధికారికంగా మౌన సమ్మతి లభించినట్లుగా భావించాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అక్రమ నిర్మాణాలకు మరింత ప్రోత్సాహం లభించే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ మళ్లీ రంగంలోకి దిగాల్సిందే..!**

గతంలో ఇదే జోడిమెట్ల పరిధిలోని 'తాజా కిచెన్' పక్కనే చేపట్టిన అక్రమ షెడ్డు నిర్మాణాన్ని స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్ టి ఎఫ్ ) అధికారులు అడ్డుకుని, కూల్చివేసి సీజ్ చేసిన విషయాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. స్థానిక మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్రమార్కులకు కొమ్ము కాస్తున్న వేళ.. నాటి తరహాలోనే స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరోసారి క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి పక్కనే నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణాన్ని కూడా తక్షణమే పూర్తిగా నిలిపివేసి, కూల్చివేత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం పనులు ఆపడమే కాకుండా, చట్టాన్ని బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అప్పుడే భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఉంటాయని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.


















# రెసిడెన్షియల్ భవనంలో వాణిజ్య దందాకు సన్నాహాలు ..!

**మహా, సిటీ బ్యూరో:**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ జోన్, ఉప్పల్ సర్కిల్, హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 లో అక్రమ నిర్మాణాల పర్వం అంబరాన్నంటుతోంది. స్థానిక లెజెండ్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న ఒక నివాస స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య దందాకు నిర్మాణ మార్పులు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నివాస సముదాయంగా ఉండాల్సిన ప్రాంతాన్ని కమర్షియల్ హబ్‌గా మార్చేందుకు సన్నాహాలు శరవేగంగా సాగుతున్నాయి. గతంలో గ్రౌండ్+1 అంతస్తుల రెసిడెన్షియల్ భవనంగా ఉన్న నిర్మాణాన్ని పూర్తిగా మార్చివేసి, ప్రస్తుతం వాణిజ్య అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం కింద భాగంలో రెండు భారీ షెటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, రెండో, మూడో అంతస్తుల్లోనూ భారీ షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు. అనుమతులు ఒకదానికి అయితే.. నిర్మాణం మరొకదానికి అన్న చందంగా స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో అక్రమ కట్టడం యదేచ్ఛగా కొనసాగుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

***నివాస సముదాయాన్ని.. వాణిజ్య కేంద్రంగా మార్పు !**

గతంలో గ్రౌండ్ +1 అంతస్తులుగా ఉన్న నివాస సముదాయం కోసం వినియోగించిన భవనంలో, నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే ఆ భవన రూపురేఖలు మార్చి, భారీ వాణిజ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కమర్షియల్ భవనాలకు ఉండాల్సిన కనీస నిబంధనలను గాలికొదిలేసి, చుట్టుపక్కల నివసించే ప్రజల భద్రతను, ప్రశాంతతను పణంగా పెడుతూ ఈ అక్రమ నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని వారు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ఇక్కడ వాణిజ్య కార్యకలాపాలు సాగితే ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులతో స్థానికుల జీవనం నరకప్రాయంగా మారుతుందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మచ్చుకైనా కనిపించని సెట్‌బ్యాక్‌లు..!**

భవన నిర్మాణ నిబంధనల (బిల్డింగ్ బైలాస్ ) ప్రకారం చుట్టూ తప్పనిసరిగా వదలాల్సిన సెట్ బ్యాక్‌లు ఇక్కడ మచ్చుకైనా కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ నిబంధనలను తుంగలో తొక్కుతూ, చుట్టుపక్కల నివాసితులకు తీవ్ర ఇబ్బందులు కలిగించేలా నిర్మాణాలు చేపడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. కనీస అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలతో పాటు, డ్రైనేజీ, పార్కింగ్ వంటి మౌలిక వసతులను సైతం పట్టించుకోకుండా, అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనం వెళ్లడానికి కూడా దారి లేని విధంగా ఈ నిర్మాణం సాగుతుండటం కమర్షియల్ షాపింగ్ సెంటర్ తరహాలో రూపుదిద్దుకుంటుండటంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రెండో.. మూడో అంతస్తుల్లో భారీ షెడ్లు..!**

భవనం రెండో, మూడో అంతస్తుల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ షెడ్ల నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గ్రౌండ్+1 రెసిడెన్షియల్ భవనంగా ఉన్న నిర్మాణాన్ని పూర్తిగా మార్చివేసి, కింది భాగంలో రెండు షటర్లతో పాటు పై అంతస్తుల్లో భారీ షెడ్లు ఏర్పాటు చేస్తుండటం నిబంధనల ఉల్లంఘనకు నిదర్శనమని వారు పేర్కొంటున్నారు.ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకోకపోవడంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలతోనే అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. హబ్సిగూడ స్ట్రీట్ నెం.8 నుంచి రామంతాపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఇంత పెద్ద ఎత్తున కమర్షియల్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ అధికారులు అడ్డుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోడ్డు సెట్‌బ్యాక్‌ను సైతం పట్టించుకోకుండా నిర్మాణాలు సాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




### భవనాన్ని సీజ్ చేయాలి.. అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి!

హబ్సిగూడ స్ట్రీట్ నెం.8 లో నిబంధనలను తూట్లు పొడుస్తూ సాగుతున్న ఈ అక్రమ వాణిజ్య భవనంపై మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపాల్సిందే నని స్థానికులు పేర్కొంటున్నారు. నివాస స్థలంలో అక్రమంగా కమర్షియల్ దందాకు సన్నాహాలు చేస్తూ, కనీస సెట్‌బ్యాక్‌లు వదలకుండా, పై అంతస్తులో ప్రమాదకరంగా భారీ షెడ్డు నిర్మించిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉందని వారు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.కేవలం నోటీసుల పేరుతో కాలయాపన చేసి చేతులు దులుపుకోకుండా, నిబంధనలను ఉల్లంఘించిన ఈ భవనాన్ని తక్షణమే సీజ్ చేయాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఆమోదిత ప్లాన్ లేకుండా, నివాస స్థలంలో నిర్మించిన కమర్షియల్ షటర్లు, రెండు, మూడో అంతస్తులోని అక్రమ షెడ్డును బుల్డోజర్లతో నేలమట్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించని పక్షంలో సంబంధిత ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో పాటు, న్యాయపరమైన మార్గాలను అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# కాలుష్య కారకులే నిందలేయడమా?

**దిల్లీ, మహా:** వాతావరణ మార్పులకు వర్ధమాన దేశాలే ప్రధాన కారణమన్నట్లుగా నిందలు వేయడం సరికాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్‌తో పోలిస్తే అభివృద్ధి చెందిన దేశాల తలసరి కర్బన ఉద్గారాలు సుమారు ఆరు రెట్లు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై దిల్లీలో శనివారం ప్రారంభమైన రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సులో ప్రధాని ప్రసంగించారు. ప్రపంచ వేదికలపై భారత్ ఈ అంశాన్ని నిరంతరం ప్రస్తావిస్తోందన్నారు.ప్రపంచ తలసరి కర్బన ఉద్గారాల్లో భారత్ వాటా చారిత్రకంగా చాలా తక్కువగా ఉందని మోదీ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాలపై బాధ్యతను నెట్టివేయడం కంటే అన్ని దేశాలు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి కూడా కొనసాగాల్సి ఉందని స్పష్టం చేశారు. పారిస్ వాతావరణ ఒప్పందం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువుకు ముందుగానే సాధించిన జీ20 దేశంగా భారత్ నిలిచిందని వివరించారు. స్వచ్ఛ ఇంధనం, పునరుత్పాదక విద్యుత్, పర్యావరణహిత అభివృద్ధి దిశగా భారత్ చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమతుల్యంగా ముందుకు సాగడమే ప్రస్తుత కాలంలో కీలక సవాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఈ అంశంపై న్యాయస్థానాల ముందున్న ప్రశ్న కూడా ఇదేనని తెలిపారు. పర్యావరణ న్యాయాన్ని పరిరక్షించేందుకు సుప్రీంకోర్టు మర్రి చెట్టులా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలుయువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి ప్రోత్సాహక పథకాల ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సుమారు రూ.లక్ష కోట్ల ఉపాధి ప్రోత్సాహక పథకాలతో రెండు కోట్ల మంది యువతీయువకులు సంఘటిత కార్మిక శక్తిలోకి చేరే అవకాశం ఉందన్నారు.దేశవ్యాప్తంగా శనివారం 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకుపైగా నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొని నియామకాలు పొందిన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. యువతలో నైపుణ్యాలను పెంచడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.



# రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

**స్టేషన్ ఘన్పూర్ మహా ;**స్టేషన్ ఘన్పూర్-నష్కల్ రైల్వే స్టేషన్ల మధ్యలో కేఎం నెంబర్ 306/2627 రైలు నంబర్ 20833 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కింద పడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకోవడమైనది. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు.రైలు ప్రమాదం కారణంగా మృతురాలి ముఖం, తలకు తీవ్ర గాయాలై, కాళ్లు, చేతులు విరిగి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతురాలు తెలుపు రంగు చున్నీ, బ్లూ కలర్ పెట్టీకోట్, బ్లూ కలర్ పై జామా ధరించి ఉన్నాయి. పై జామా చిరిగి పోయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలిని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించడం జరిగింది. బమృతురాలి వివరాలు, ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన పై కాజీపేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతురాలి గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే కాజీపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ వడ్డే నరేష్ కోరారు. ఎస్సై రైల్వే పోలీస్ 8712658609 లేదా హెడ్ కానిస్టేబుల్ 8712576424 నెంబర్లకు సంప్రదించగలరని ఇన్స్పెక్టర్ తెలిపారు.



# ప్రముఖులకు ఎస్ఐఆర్ నోటీసులు

**న్యూఢిల్లీ, మహా:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేస్తోంది. ఓటర్ల ప్రస్తుత వివరాలను గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ రికార్డులతో అనుసంధానం చేసే క్రమంలో తేడాలు గుర్తించిన వారికి ఈ నోటీసులు పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. తాజాగా విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్, ఆయన భార్య క్యోకో జైశంకర్‌కు కూడా ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' విభాగంలో వారి పేర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. 2002 నాటి ఎస్ఐఆర్ ఓటరు జాబితాతో ప్రస్తుత వివరాలు అనుసంధానం కాకపోవడంతో ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. జైశంకర్ దంపతులు న్యూదిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలోని సుందర్‌బాగ్ ప్రాంతంలో ఓటర్లుగా నమోదై ఉన్నారు.

ఇదే ప్రక్రియలో సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్ బ్రిట్టాస్‌కు కూడా నోటీసులు అందాయి. గత ఓటరు రికార్డులతో వివరాలను సరిపోల్చే సమయంలో షెబా పేరులోనూ, ఆనంద్ వివరాల్లోనూ తేడాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో వారిని కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన జాబితాలో చేర్చారు.ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద నోటీసులు అందినట్లు సమాచారం. గత రికార్డులతో ప్రస్తుత ఓటరు వివరాలను అనుసంధానం చేయడంలో తలెత్తిన వ్యత్యాసాలపై వివరణ కోరుతూ ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఎస్ఐఆర్ నోటీసులు అందడం అంటే ఓటరు జాబితా నుంచి వెంటనే పేరు తొలగించినట్లు కాదని ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. సంబంధిత ఓటర్లు తమ వివరాలను ధ్రువీకరించేందుకు అవసరమైన పత్రాలు, ఆధారాలను సమర్పించే అవకాశం ఉంటుంది. పరిశీలన అనంతరం అర్హత ఉన్న వారి పేర్లను ఓటరు జాబితాలో కొనసాగించే ప్రక్రియ చేపడతారు. దీంతో ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న వారి వివరాలపై ప్రస్తుతం దిల్లీలో రాజకీయ, ప్రజా వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

# కోర్టు నిధులపై ఏకరూప నిబంధనలు

**దిల్లీ, మహా:** వివిధ కేసులు, వ్యాజ్యాలకు సంబంధించి కోర్టులు, ట్రైబ్యునళ్ల వద్ద జమయ్యే సొమ్ము నిర్వహణకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన నిబంధనలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. కోర్టుల్లో డిపాజిట్ చేసే మొత్తాల నిర్వహణ, బ్యాంకుల్లో జమ చేయడం, వాటిపై వచ్చే వడ్డీ, సొమ్ము ఉపసంహరణ, తిరిగి డిపాజిట్ చేయడం వంటి అంశాలకు సంబంధించి ప్రస్తుతం వేర్వేరు కోర్టులు వేర్వేరు విధానాలను అనుసరిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి ఒక ప్రామాణిక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు లా కమిషన్‌కు సూచనలు చేసింది. కోర్టులు, ట్రైబ్యునళ్ల వద్ద జమయ్యే ప్రజా, వివాదాస్పద నిధుల నిర్వహణలో స్పష్టత, పారదర్శకత ఉండేలా తగిన శాసనం అవసరమని ధర్మాసనం పేర్కొంది. ఇందుకు సంబంధించి దేశవ్యాప్తంగా అమలు చేయగల ఏకరూప నిబంధనలను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. ఒక మధ్యవర్తిత్వ వివాదానికి సంబంధించి దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. వివాదంలో ఉన్న మొత్తానికి సంబంధించి మధ్యవర్తిత్వ తీర్పు వెలువడిన తేదీ నుంచి బకాయిదారు సొమ్ము చెల్లించే వరకు అసలుతో పాటు వర్తించే వడ్డీని చెల్లించాల్సి ఉంటుందని దిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా కోర్టుల్లో డిపాజిట్ చేయాల్సిన మొత్తానికి సంబంధించిన విధానాల్లో ఉన్న వ్యత్యాసాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. కొన్ని సందర్భాల్లో ఎంత మొత్తాన్ని కోర్టులో జమ చేయాలి, జమ చేసిన సొమ్మును ఏ బ్యాంకులో లేదా ఏ విధంగా ఉంచాలి, దానిపై వచ్చే వడ్డీని ఎలా నిర్వహించాలి, అవసరమైనప్పుడు సొమ్మును ఎలా విడుదల చేయాలి వంటి అంశాల్లో భిన్నమైన పద్ధతులు అమల్లో ఉన్నాయని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాల్లో ఏకరూపత లేకపోవడం వల్ల అనవసరమైన సందిగ్ధతలకు అవకాశం ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందువల్ల కోర్టులు, ట్రైబ్యునళ్ల వద్ద జమయ్యే మొత్తాల నిర్వహణకు సంబంధించి స్పష్టమైన నిబంధనలను రూపొందించి, వాటిని దేశవ్యాప్తంగా ఒకే విధంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని లా కమిషన్‌కు సూచించింది.

# లోకల్ వార్‌కు జనసేన రెడీ

**కందుల దుర్గేష్ కు ఎన్నికల బాధ్యతలు**



**అమరావతి, మహా :** ఏపీలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సన్నద్ధమవుతోంది. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రచార వ్యూహంపై చర్చించారు. ఎన్నికలకు ముందే పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో సమన్వయం చేయడంతో పాటు.. గ్రామాలు, వార్డుల స్థాయి వరకు ప్రచార కార్యక్రమాలను విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు, ప్రచార కార్యక్రమాల నిర్వహణ, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. జనసేన ప్రచార కమిటీ సమన్వయకర్తగా మంత్రి కందుల దుర్గేష్‌కు బాధ్యతలు అప్పగించారు. ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును కమిటీ సభ్యుడిగా నియమించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతగా ఉండనుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి పార్టీ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు జనసేన నాయకత్వం చర్యలు చేపడుతోంది.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం ఖాయం

**కేంద్రమంత్రి బండి సంజయ్**



**కరీంనగర్ , మహా :** కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం చేయడం ఖాయమని ఎద్దేవా చేశారు. ఆదివారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దానం నాగేందర్ తను వినాయకుడితో పోల్చుకోవడం సరికాదని పేర్కొన్నారు. వినాయకుడిని చివరిలో నిమజ్జనం చేస్తారనే విషయం దానం నాగేందర్‌కు తెలియదా.? అని ప్రశ్నించారు. దానం నాగేందర్ నిండు నూరేళ్లు జీవించాలని బండి సంజయ్ కోరుకున్నారు. కాంగ్రెస్ తమకు పోటీనే కాదని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నేతల ఫాంహౌస్ సందర్శన ఓ జోక్ లాగా ఉందని వ్యంగ్యంగా మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ ఫాంహౌస్‌లు ఏమైనా టూరిజానికి కేంద్రాలా.? అని ప్రశ్నించారు. ప్రైవేటు భూముల్లోకి వెళ్లడానికి కాంగ్రెస్ నేతలకు అధికారం ఎక్కడదని బండి సంజయ్ ప్రశ్నించారు.

# తెలంగాణ వార్ రూమ్ నుంచి ఢిల్లీ జాతీయ వార్ రూమ్ వరకు

- కులగణనపై కాంగ్రెస్ 100 రోజుల జాతీయ క్యాంపెయిన్‌కు రుద్ర సంతోష్ కుమార్ కీలక బాధ్యత
- తెలంగాణలో బూత్ స్థాయి సమన్వయ అనుభవానికి జాతీయ స్థాయిలో గుర్తింపు



**కరీంనగర్ మహా** : తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లడంలో కీలకంగా పనిచేసిన రుద్ర సంతోష్‌కుమార్‌కు ఇప్పుడు జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగించబడ్డాయి. దేశవ్యాప్తంగా కులగణనపై కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న 100 రోజుల క్యాంపెయిన్‌కు సంబంధించి ఏఐసీసీ వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా ఆయనను నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కులగణనపై ప్రజల్లో అవగాహన కల్పించడం నుంచి రాష్ట్రాల వారీ కార్యాచరణ, శిక్షణ, సంస్థాగత సమన్వయం, డిజిటల్ మానిటరింగ్, వారపు పురోగతి నివేదికల వరకు వివిధ అంశాలను సమన్వయం చేసేలా జాతీయ వార్ రూమ్ కార్యాచరణను రూపొందించనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ నుంచి నియామకపత్రం జారీ అయినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**తెలంగాణ మోడల్‌కు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం**

2024-25లో తెలంగాణలో కులగణన ప్రక్రియ సందర్భంగా రుద్ర సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వార్ రూమ్, కాల్ సెంటర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి సమన్వయం చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ద్వారా పార్టీ కార్యకర్తలు, మండల అధ్యక్షులు, బ్లాక్, గ్రామ, బూత్ స్థాయి ప్రతినిధులతో నిరంతర సమన్వయం నిర్వహించినట్లు పేర్కొన్నాయి.

సుమారు 45 రోజులపాటు సాగిన ఈ ప్రక్రియలో రోజుకు 2,000 మందికిపైగా కార్యకర్తలు, సంస్థాగత ప్రతినిధులతో సంప్రదింపులు జరిపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా 100కుపైగా కుల సంఘాలు, సుమారు 35 వేల మంది బూత్ స్థాయి కార్యకర్తలతో సమన్వయం చేసినట్లు వెల్లడించాయి.

**ఢిల్లీలో జాతీయ ఓబీసీ వర్క్‌షాప్**

ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 8న ఢిల్లీలోని ఏఐసీసీ ఇందిరా భవన్‌లో నిర్వహించిన జాతీయ ఓబీసీ వర్క్‌షాప్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐసీసీ ఓబీసీ జాతీయ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్, ఏఐసీసీ మైనారిటీ జాతీయ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, వివిధ రాష్ట్రాల ఓబీసీ, మైనారిటీ విభాగాల చైర్మన్లు, జాతీయ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో కులగణన అవసరం, రాష్ట్రాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి అవగాహన, మానిటరింగ్ వ్యవస్థ తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**45 నిమిషాల ప్రెజెంటేషన్**

100 రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా 15 వారాలపాటు దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికను రుద్ర సంతోష్‌కుమార్ సమగ్రంగా ప్రెజెంట్ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సుమారు 45 నిమిషాలపాటు సాగిన ప్రెజెంటేషన్‌లో రాష్ట్ర స్థాయి వార్ రూమ్‌ల ఏర్పాటు, మాస్టర్ ట్రైనర్ల ఎంపిక, జిల్లా స్థాయి శిక్షణ, మండల-గ్రామ స్థాయికి కార్యక్రమాల విస్తరణ, డిజిటల్ మానిటరింగ్, వారపు పురోగతి నివేదికలు, రాష్ట్రాల మధ్య సమన్వయం వంటి అంశాలను వివరించినట్లు తెలిపాయి.

**బూత్ స్థాయి అనుభవం.. జాతీయ బాధ్యత**

తెలంగాణలో కులగణన సందర్భంగా వార్ రూమ్ నిర్వహణ, కాల్ సెంటర్ సమన్వయం, డిజిటల్ మానిటరింగ్, బూత్ స్థాయి కార్యకర్తలతో అనుసంధానం, రోజువారీ పురోగతి పర్యవేక్షణ వంటి అంశాల్లో పనిచేసిన అనుభవాన్ని రుద్ర సంతోష్ కుమార్ ఇప్పుడు జాతీయ స్థాయిలో వినియోగించనున్నారు.తెలంగాణలో క్షేత్రస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు నిర్మించిన సమన్వయ వ్యవస్థ, దేశవ్యాప్తంగా చేపట్టనున్న 100 రోజుల క్యాంపెయిన్‌కు కార్యాచరణ రూపకల్పనలో ఉపయోగపడనుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో తెలంగాణలో ప్రారంభమైన కులగణన సమన్వయ అనుభవం ఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయి బాధ్యతల వరకు విస్తరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

100 రోజులు.. 15 వారాలు.. దేశవ్యాప్త సమన్వయం క్యాంపెయిన్‌ను దశలవారీగా అమలు చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రాల వారీ ఓరియంటేషన్, మాస్టర్ ట్రైనర్ల శిక్షణ, జిల్లా స్థాయి కార్యక్రమాలు, ఓబీసీ కమ్యూనిటీ అవుట్‌రీచ్, పౌర సమాజ సంస్థలతో సమన్వయం వంటి కార్యక్రమాలను వివిధ దశల్లో చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నాయి. రాష్ట్రాల నుంచి వారపు ఫీడ్‌బ్యాక్‌ను సేకరించడం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను గుర్తించడం, అవసరమైన మార్గదర్శకాలను అందించడం వంటి అంశాల్లో జాతీయ వార్ రూమ్ కేంద్ర సమన్వయ వేదికగా పనిచేయనుందని పార్టీ వర్గాలు తెలిపాయి.



# రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత

**మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం దిశగా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మూడు జిల్లా కాంగ్రెస్ కమిటీలకు (డీసీసీ) నూతన అధ్యక్షులను నియమించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత, సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పటోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడిగా ఎండీ ముస్తఫా నియమితులయ్యారు. హైదరాబాద్ మహానగరానికి సమీపంలో ఉండే రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు రాజకీయంగా అత్యంత కీలకమైనవి కాగా, రామగుండం ప్రధాన పారిశ్రామిక ప్రాంతం కావడంతో పార్టీ ఇక్కడ ప్రత్యేక దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా పార్టీని జిల్లా స్థాయిలో బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ చేపట్టిన పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగానే ఈ నియామకాలు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



# నిజాం ఆస్తుల కంటే కేసీఆర్ కుటుంబ ఆస్తులే ఎక్కువ

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నేతలకు చెందినవని ఆరోపిస్తూ, ఆ భూముల నిజాలు నిగ్గుతేల్చేందుకు కాంగ్రెస్ నేతలు గత రెండు రోజులుగా బృందంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా హస్తం పార్టీ ప్రజాప్రతినిధులు రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్‌లోని హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌ను సందర్శించారు. మూడోరోజు క్షేత్రస్థాయి భూముల పరిశీలనలో భాగంగా నగరంలోని ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించారు. తాము ఫామ్‌హౌస్‌లోకి వెళ్లలేదని, ప్రజలకు తెలియజేయాలనే ఇక్కడికి వచ్చామని మల్లు రవి తెలిపారు. పేదల నుంచి అసైన్డ్ భూములను గుంజుకుని ఫామ్‌హౌస్‌లు కట్టారని, అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. నిజాం ఆస్తుల కంటే మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ ఆస్తులే ఎక్కువని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆ ఆస్తులన్నీ ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే భూముల పరిశీలనకు వచ్చామన్నారు. కేటీఆర్‌కు 2009లో లేని ఆస్తులు ఇప్పుడెలా వచ్చాయని ప్రశ్నించారు. హరీశ్‌రావుకు ఉద్యమ సమయంలో లేని ఫామ్‌హౌస్ ఇప్పుడు ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ పక్కన ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూములను దళితులకు ఎందుకు పంచలేదని నిలదీశారు. ఆ భూమిని కబ్జా చేయాలని కేసీఆర్ చూశారని ఆరోపించారు.

అప్పుల పాలు చేశారు 111 జీవో నిబంధనలను తుంగలో తొక్కి ఫామ్‌హౌస్ నిర్మాణం చేపట్టారని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో లేని ఆస్తులు ఇప్పుడు ఉన్నట్టుండి ఎలా వచ్చాయని ప్రశించారు. మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాలనలో అప్పుల పాలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్ని అక్రమాలు జరిగాయో ప్రజలకు తెలియజేసేందుకే క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. 450 ఎకరాలకు పైగా ఉన్న భూముల వివరాలు తెలంగాణ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఐలయ్య. వీర్లపల్లి శంకర్, రామ్మోహన్ రెడ్డి, నవీన్ యాదవ్, మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోని సవాల్‌గా తీసుకుందాం

**ఏపీ సీఎం చంద్రబాబు**

**రైతులకు నష్టం రాకుండా కార్యాచరణ**



**అమరావతి, మహా :** ఎల్‌నినో ప్రభావంతో రైతులకు నష్టం రాకుండా, ధరలు అదుపుతప్పకుండా ప్రభుత్వం ముందస్తు కార్యాచరణకు సిద్ధమైంది. ఎల్‌నినోను విపత్తుగా కాకుండా సవాల్‌గా ఎదుర్కొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. రైతులను కాపాడటంతో పాటు నిత్యావసరాల ధరలు అదుపుతప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను నియంత్రించాలని సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం రైతులపైనే కాకుండా అన్ని వ్యవస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో వాటి ప్రభావం ప్రజలపై పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఖరీఫ్ సాగు పరిస్థితులపై సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో వర్షపాతం లోటును సీఎం ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు ఉందని వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు.

# ఎమ్మెల్సీ రేసులో..

## గవర్నర్ కోటాలో సత్తు మల్లేష్, హర్కరి వేణుగోపాల్, షబ్బీర్ అలీ ?

( మొదటి పేజీ తరువాయి )

శక్తివంచన లేకుండా పనిచేస్తే అధిష్ఠానం మన్ననలు పొందారు. ఈ దఫా ఆయనకు ఎమ్మెల్సీ బెర్త్ ఖాయమని భావిస్తున్నారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కరి వేణుగోపాల్ పేర్లు బలంగా వినబడుతున్నాయి. హర్కరి వేణుగోపాల్ కు బెర్త్ ఖాయమన్న చర్చ జరుగుతోంది. మైనారిటీ కోటాలో ఇప్పటికే అజారుద్దీన్ కు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇచ్చినందున మరో ఎమ్మెల్సీని అదే కోటాలో ఇస్తారా అనే చర్చ జరుగుతోంది. అయితే మైనారిటీల జనాభా, షబ్బీర్ అలీ పార్టీకి అందించిన సేవలు, సీనియారిటీ రీత్యా అవకాశముందని చెబుతున్నారు. ఓసీ కోటాలో దయాసాగర్, ఎస్టీ కోటాలో బెల్లయ్యనాయక్ పేరు కూడా పరిశీలనకు రావొచ్చని చెబుతున్నారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పదవికి పోటాపోటీ**

'వరంగల్-ఖమ్మం-నల్గొండ' గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని ఆశిస్తున్న వారిలో గుత్తా అమిత్, పటేల్ రమేశ్ రెడ్డి, పీవీ శ్రీనివాస్, కైలాశ్ నేత, మెండెం కిరణ్ (రైట్ ఛాయిస్ విద్యా సంస్థలు), అయోధ్యరెడ్డి ఉన్నారు. ఇక 'మహబూబ్ నగర్ -హైదరాబాద్-రంగారెడ్డి' ఎమ్మెల్సీని ఆశిస్తున్న వారిలో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి, సామా రామ్మోహన్ రెడ్డి, గౌరు సతీశ్, మన్నే జీవన్ రెడ్డి ఉన్నారు. హైదరాబాద్ రంగారెడ్డిపాలమూరు స్థానానికి టీశాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉండగా, పాలమూరు ప్రజాప్రతినిధులు మద్దతుగా ఉన్నారు. మహబూబ్ నగర్ జిల్లా నుండే అభ్యర్థిని ఎంపిక చేయాలని వారు కోరుతున్నారు.



# కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా తెలంగాణ బహుజనుల బాణాన్ని

( మొదటి పేజీ తరువాయి )

ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడుతుందని నిరూపించడానికే ఇక్కడికి వచ్చా'' అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత మాట్లాడారు. ''దేశంలో పరిస్థితి ఎలా ఉందంటే.. మహిళలు మహారాణులు అంటారు. కానీ, వంటింట్లో గిన్నెల మీద మగవాళ్ల పేర్లే ఉంటాయి. 29 రాష్ట్రాలున్న ఈ దేశంలో ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉంది. చరిత్ర తిరగరాద్దామా? తెలంగాణలో మాతృస్వామ్య వ్యవస్థ తెచ్చుకుందామా? ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్థాన్‌తో సమానంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. ప్రజలకు ఏం సమాధానం చెబుతారు'' అని కవిత ప్రశ్నించారు. కార్యకర్తలతో భారీ ర్యాలీగా కొడంగల్ సభా స్థలికి చేరుకున్న ఆమె.. సభకు పెద్ద ఎత్తున జనం హాజరవడంతో ఉత్సాహంగా ప్రసంగించారు.



# తెలంగాణకు వర్ష సూచన

- వారం రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షా లు

**హైదరాబాద్, మహా** : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడే అవకాశం ఉన్నందున తెలంగాణలో ఆదివారం నుంచి వారం రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని 24 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వారు వెల్లడించారు.

**వాయుగుండంగా మారే అవకాశం..**

ప్రస్తుతం అల్పపీడనం ఉత్తర అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇది సెప్టెంబర్ 21న వాయుగుండంగా, 22న తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 23 ఉదయం నాటికి దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు సమీపంలోని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో 20, 21, 22, 23, 24, 25వ తేదీల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# 'వ్యవస్థ' గుప్పిట్లో దేశం: రాహుల్

**ఇండోర్, మహా:** దేశం మొత్తం ఓ 'వ్యవస్థ' గుప్పిట్లో చిక్కుకుపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థులు ప్రశ్నించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం ఈ వ్యవస్థకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. దేశంలో ద్వేషాన్ని తొలగించేందుకు యువత, విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శనివారం 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రాహుల్ సమావేశమై మాట్లాడారు.ఏ దేశ భవిష్యత్తుకైనా యువతే కీలకమని రాహుల్ అన్నారు. యువత చురుకైన పాత్ర లేకుండా దేశం అభివృద్ధి సాధించలేదని పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం అవసరమన్నారు. అదానీ, అంబానీ, జై షా తదితరుల పాత్రతో పాటు దేశంలోని రాజకీయ, ఆర్థిక వ్యవస్థపై విద్యార్థులు ప్రశ్నలు సంధిస్తున్నారని తెలిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ, భాజపాకు మద్దతుగా నిలిచే కొంతమంది వారి ప్రశ్నలను వ్యతిరేకిస్తున్నారని రాహుల్ విమర్శించారు.విద్యార్థుల్లో కుతూహలం, ప్రేమ, అణకువ, సహనం, నిజాయతీ వంటి లక్షణాలు ఉంటాయని రాహుల్ అన్నారు. ప్రశ్నించే తత్వం, కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి యువతకు దేశ నిర్మాణంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దేశంలో ద్వేషపూరిత వాతావరణాన్ని తొలగించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.విద్యా రంగంపై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రాహుల్ పేర్కొన్నారు. లక్ష పాఠశాలలు మూతపడ్డాయని ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో విద్యకు బడ్జెట్‌లో 4.6 శాతం కేటాయించగా, ప్రస్తుతం అది 2.6 శాతానికి తగ్గిందని విమర్శించారు. విద్యకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదన్నారు.ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీలపై రాహుల్ గాంధీ పలు ఆరోపణలు చేశారు. వీరి విధానాలు దేశంలోని వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయని విమర్శించారు. అయితే రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలను ఆయా వర్గాల అభిప్రాయాలు, ప్రభుత్వ గణాంకాలతో విడిగా పరిశీలించాల్సి ఉంది.



తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 21-09-2026
సాహిత్యం నిర్వహణ హనీఫ్ 04

## మేమూ – వాళ్ళూ

వాళ్లు పూజలు పునస్కారాలు చేస్తారు
అయినా వాళ్ళ మనసుల నిండా
ద్వేషం కసి క్రూరత్వంతో
నరకయాతన అనుభవిస్తూ ఉంటారు

మేము మానవత్వాన్ని నమ్ముకున్న వాళ్ళం
ఆనందం ప్రేమ కరుణానుభూతులతో
ప్రజలు వద్దకు చేరుకుంటాము

వాళ్లు ప్రజలను పీడించి పీడించి
పాపాలన్నీ మూటగట్టుకుంటున్నారు
మేము మా ప్రేమను స్నేహాన్ని
మా సంపదతో పాటుగా ప్రజలతో పంచుకుంటాము

వాళ్లు చనిపోయి నరక ద్వారాల మెట్ల దగ్గర
పహరా కాస్తుంటారు
మేము స్వర్గ ద్వారాల మెట్లెక్కి
స్వర్గానికి చేరుకుంటాం

వాళ్లకు మతము ద్వేషము భక్తి మొదలైనవి ముడి సరుకులు
మాకు స్నేహము సౌభ్రాతృత్వం స్వాతంత్ర్యం సమభావము సమతా వస్తువులు

వాళ్ళు పశువులను ఆయుధాలుగా చేసుకుని ముందుకు నడుస్తున్నారు
మేము శ్వేత కపోతాలను ఎగరేసుకుంటూ సాగుతున్నాము

వాళ్ళు ఆయుధాలకు పని చెబుతూ రక్తపాతాలను సృష్టిస్తున్నారు
మేము శాంతి అహింసలను ఆయుధాలుగా ధరించి ముందుకు సాగుతున్నాము

వాళ్లు అనేక మాయోపాయాలతో విజయదుందుభులు మోగిస్తున్నారు
మేము యువ ధిక్కార స్వరాలు
సాయుధ బలగాలుగా ముందుకు సాగుతున్నాము

ఇరువర్గాల మధ్య యుద్ధం తీవ్రంగా నడుస్తోంది
పోరాటం సాగుతోంది జంతర్ తర్ వేదికగా
మంచికి చెడుకి జరిగే పోరాటమిది
దుర్మార్గులకి సన్మార్గులకి జరిగే పోరాట రూపమిది

–మంచికంటి ( 9949535695)




## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
haneefsd777@gmail.com
whatsapp
9247580946

# విస్మృత చరిత్రకు వెలుగు దివ్వె

తెలంగాణ ఆధునిక కవితా వికాసం, విమర్శ, చరిత్ర సమగ్రంగా ఇప్పటికి ఎక్కడా రికార్డు కాలేదు. తెలుగు కవితా వికాసం పేరిట జరిగిన రచనల్లో తెలంగాణకు న్యాయమైన ప్రాతినిధ్యం, ప్రాధాన్యత దక్కలేదు. అంతెందుకు 'ఆధునికాంధ్ర కవిత్వం' పేరిట సి.నారాయణరెడ్డి 1975లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఒక మోనోగ్రాఫ్‌ని రాసిండ్రు. అందులో అంతా ఆంధ్రా ప్రాంతం వారే ఉన్నారు గానీ మచ్చుకు ఒక్క తెలంగాణ కవి కనబడలేదు. భావకవిత్వం వరకు అని రాసిన ఆ రచనలో ఒద్దిరాజు సోదరులు, రూప్‌ఖాన్‌పేట రత్నమాంబ దేశాయి, వేలూరి రంగధామానాయుడు, సురవరం ప్రతాపరెడ్డి ఇట్లా పదుల సంఖ్యలో కవిత్వం రాసిన నవ్యులు ఉన్నారు. కానీ ఆయన దృష్టికి వీరు ఆనలేదు. అయితే తెలంగాణ ఆధునిక కవిత్వ విమర్శవిశ్లేషణ, చరిత్ర రచన పనిని కొంతమేరకు సుంకిరెడ్డి నారాయణరెడ్డి తెలుగు అకాడెమీ, తెలంగాణ సాహిత్య అకాడెమీ, తెలంగాణ సారస్వత పరిషత్‌లకు రాసిన వ్యాసాల్లో రికార్డు చేశారు. ఇది సమగ్రం కాదు. ఈ విషయంలో కొంత లోతుగా అధ్యయనం చేస్తే ఆనాటి కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని ఉషఃకిరణాలు గ్రంథం ద్వారా యండమూరి సత్యనారాయణ నిరూపించారు. అయితే ఈ విషయములో పునాది రచనగా బిరుదురాజు రామరాజు 1954లోనే 'తెలంగాణా కవిమిత్రులు' శీర్షికన వ్యాసాలు వెలువరించారు. ఆ వ్యాసాలు తెలంగాణ పత్రికల్లో గాకుండా కృష్ణా పత్రికలో వెలువరించాడు. అంటే ఇక్కడి వారి గురించి ఆంధ్రావారికి తెలియజెప్పడమే వాటి ప్రధానోద్దేశం.

ఈ విమర్శ వ్యాసాల్లో పేర్కొన్న సీనియర్ కవి ఉదయరాజు శేషగిరిరావు. వరంగల్ జిల్లాకు చెందిన ఈయనను 'చరన్నింఘటువు' అంటే నడిచే విజ్ఞాన సర్వస్వంగా బిరుదురాజు పేర్కొనేవారు. ఏ ప్రాచీన గ్రంథములోని పద్యాన్నైనా అడిగినదే తడవుగా పుస్తకాలను రెఫర్ చేయకుండానే గడగడ చెప్పేసేవారు. సందర్భానుసారంగా ఏ పద్యం పనికి వస్తుందో వివరించేవారు. వరంగల్‌లోనే ఉండేవారు. ఎమ్మే చదివారు. విశ్వేశ్వరాంధ్ర సంస్కృత కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. ఆయన మెట్రిక్ చదివే నాటికే ఖండకావ్యాలు రాసి గురువుల మన్ననలందుకున్నారు. టీచర్‌గా కొన్ని రోజులు ఆదిలాబాదు జిల్లా ఆసిఫాబాదులో పనిచేశారు. అక్కడి కేశవనాథ ఆలయంపై శతకాన్ని రాసిండ్రు. అట్లాగే పాశ్చాత్య విద్యావేత్తలు అనే వ్యాస రచన, మనోరమ అనే కావ్యాన్ని వెలువరించారు. దీన్ని ఆయన 21వ యేట 1928లో రాసిండ్రు. అట్లాగే ఆంధ్రపత్రికలో అనేక చాటువులు ప్రచురించారు. పర్షియన్ భాష నుండి 'కరీమా' పేరిట గ్రంథాన్ని అనువదించారు. 'కవిరాజ చూడామణి'గా బిరుదాంకితులైన ఈయన రాసిన అనేక రచనలు అచ్చుకు నోచుకోలేదు. తెలంగాణ కవులు ప్రచార విముఖులు అని రామరాజు పేర్కొన్నారు. ఈ ప్రచార విముఖత్వం మూలంగానే గొప్ప గొప్ప పండితులు ఎవ్వరికీ పరిచయం లేకుండా అనామకంగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఉదయరాజు శేషగిరిరావు 'మనోరమ' కావ్యాన్ని సాహిత్య అకాడెమీ 2019లో పునర్ముద్రించి అందుబాటులోకి తెచ్చింది.

శేషగిరిరావు తర్వాత సీనియర్ అయిన మరో కవి గార్లపాటి రాఘవరెడ్డి. ఈయన సైతం టీచర్‌గా పనిచేసిండ్రు. తెలంగాణ భాషను అమితంగా ప్రేమించారు. రాసిండ్రు. షష్టిపూర్తి సందర్భంగా ఈయన రచనలు 'రాఘవరెడ్డి రచనలు' పేరిట 1963లో ప్రచురితమయ్యాయి. కాళోజి నారాయణరావుకు గురువు. జాతీయ వాది.




తెనెలొలికే ఈయన భాషా మాధుర్యం పాఠ్యాంశాలుగా చోటు చేసుకోవాల్సింది. కానీ అకడమీషియన్స్ ఉదాసీనత వల్ల ఈయన అందరికీ తెలియకుండా పోయిండు. సౌమ్యుడిగా పేరొందిన రాఘవరెడ్డి ఎన్నడూ పేరుకోసం ప్రాకులాడలేదు. తనకు ఇష్టమైన పని తాను చేసిన అనే ఆలోచనలో ఉండేవారు. 1928లో భార్యావియోగం తర్వాత మరింతగా చింతనాపరుడయ్యిండు. నిందించాల్సిన సమయంలోనూ హితవు చెప్పే మాదిరిగా సౌమ్యంగా విషయాన్ని చెప్పడం రాఘవరెడ్డి ప్రత్యేకత. ఈ విషయాలన్నీ ఆయనతో సాన్నిత్యము ఉన్న బిరుదు రాజు తన వ్యాసంలో విశదీకరించారు.

వానమామలై వరదాచార్యులు, వారి అన్న జగన్నాథాచార్యులు గురించి వివరంగా రాసిండు. ఈ ఇద్దరూ జన్మతః మడికొండ (వరంగల్ జిల్లా) వారయినప్పటికీ వివిధ ప్రదేశాల్లో స్థిరపడ్డారు. వీరి కవితా పాండిత్యాన్ని గురించి వివరించిండు. తెలంగాణ రచయితల సంఘం పూనిక మేరకే వరదాచార్యులు బతికినాడని కూడా చెప్పుకోవాలి. క్షయ వ్యాధి బారిన పడిన వరదాచార్యులుని బతికించుకోవడం కోసం తెలంగాణ రచయితల సంఘం తరపున వట్టికోట ఆళ్వారుస్వామి విరాళాలు సేకరించి మైసూరులో వైద్యం ఇప్పించారు.

అంతేగాదు సాహితీవేత్త కూడా అయిన బూర్గుల రామకృష్ణారావుని ఒప్పించి వరదాచార్యులు వైద్యం ఖర్చుని ప్రభుత్వం భరించే విధంగా విన్నవించారు. అభినవ పోతన బిరుదాంకితుడైన ఈయన కవితాధార కూడా భాగవతము అంతా మాధుర్యంగా ఉంటుంది. ఈయన ఒక వైపు 'పోతన' కావ్యాన్ని రాయడమే గాకుండా మరోవైపు 'ఆహ్వానము' పేరిట వెలువరించిన గేయకావ్యంలో చీపురు, పాకీవాడు తదితర అంశాలపై కవిత్వ మల్లిండు.

తెలంగాణలో బాల సాహిత్యానికి పునాది వేసింది వెల్దుర్తి మాణిక్యరావు. తెలంగాణ భాషలో 'దయ్యాల పన్గడ' నాటకాన్ని రాసిండు. మిత్రుడు బొజ్జం నర్సింలు జీవిత చరిత్రను రికార్డు చేసిండు. అంతేగాదు హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పేరిట విపులమైన చరిత్ర గ్రంథాన్ని వెలువరించారు. ఈయన కవిత్వం 'మాణిక్యవీణ' పేరిట వెలువడింది. అనేక కథలు రాసిండు కానీ అవేవి పుస్తక రూపంలోకి రాలేదు. తెలంగాణతనాన్ని మూర్తీ భవించిన మాణిక్యరావు హైదరాబాద్ నగరంలో సాహిత్య సంస్థల నిర్వహణలో దిట్ట. అందులో భాగంగానే 'అణా గ్రంథమాల'ను నిర్వహించడమే గాకుండా, అంతకు ముందు 'వైతాళిక సమితి'ని కాళోజీ, వెంకట రాజన్న అవధానులతో కలిసి ఏర్పాటు చేసిండు. తెలంగాణ రచయితల సంఘంలోనూ క్రియాశీలకంగా ఉన్నాడు.

తెలంగాణ నుంచి బాల సాహిత్యాన్ని బలంగా సృజించిన మాణిక్యరావు గురించి, ఆయన పట్టుదల, వాటి సాధనకు చేసే కృషిని బిరుదురాజు ఈ వ్యాస సంపుటిలో వివరంగా చర్చించిండు. నిజానికి ఆయన సమగ్ర సాహిత్యం వెలువడినట్లయితే తొలినాటి ఆధునిక/అభ్యుదయ సాహిత్యం ఎరుక తెలుగువారందరికీ కలుగుతుంది. ఈ విషయంలో ఆయన కొడుకు 'హర్ష'కొంత పనిచేసినప్పటికీ, ఆయన మరణం తర్వాత ఆ పని కుంటు పడింది.

అట్లాగే పేరులోనే తిరుగుబాటుని చేర్చుకున్న 'భాగి' నారాయణమ మూర్తి సికింద్రాబాద్‌లో జన్మించిండు. రమణమహర్షి శిష్యులు. 'పరీక్ష చదువు' పేరిట నాటికల సంపుటిని వెలువరించాడు. ఇందులో 'పరీక్ష చదువు', 'పరీక్షలపుడు', 'పరీక్షల తరువాత' పేరిట విద్యార్థుల మనోభావాలను చిత్రిస్తూ నాటికలు రాసిండు. 1940వ దశకంలో తెలంగాణ వైతాళిక కవుల్లో ఒకరుగా వెలిగిండ్రు. 'పద్మం కథలు' పేరిట కథా సంపుటి వెలువరించేందుకు ప్రయత్నించాడు. కానీ అది అచ్చయినట్లు కానరాదు. ఈయన కవిత్వం కూడా ఇప్పటి వరకు పుస్తకంగా వెలువడలేదు. ఈయన రచనలు 'జయగంటలు', 'రుధిరరేఖలు' తదితర ఖండకావ్యాలు అముద్రితాలు. సి.నారాయణరెడ్డితో కలిసి 'పూలపాటలు' పేరుతో రాజశ్రీ సాహిత్య సంస్థ తరపున 1952లో పాటల సంకలనం వెలువరించాడు. సాధన సమితి నిర్వాహకుల్లో ఒకరు. అందుబాటులో ఉన్న ఈయన సాహిత్యం వెలుగులోకి తీసుకొచ్చేందుకు 'కవిలె' ప్రయత్నం చేస్తున్నది.

వీరితో పాటుగా వరంగల్ జిల్లాకు చెందిన పల్లా దుర్గయ్య, పొట్లపల్లి రామారావు, కాళోజి, దాశరథిల రచనలపై సునిశిత విశ్లేషణ ఉన్నది. తన కన్నా చిన్నవాడైన సహచార్యులు సి.నారాయణరెడ్డి కవితా ప్రయాణాన్ని అక్షరీకరించారు. ఆయన కవిత్వంలోని లోతుపాతులను పరిశీలిస్తూనే లోపాలను ఎత్తి చూపిండు. వీరి గురించి సాహిత్య చరిత్రలో రికార్డయి ఉన్నది కాబట్టి పెద్దగా వివజరించాల్సిన అవసరం లేదని భావిస్తున్నాను.

తెలంగాణ సాహిత్య చరిత్ర రచనలో భాగంగా కవితా వికాసం గురించి చర్చించాల్సి వచ్చినప్పుడు అనేక ఖాళీలున్నాయి. ఆ ఖాళీలను కొంతమేరకైనా ఈ 'తెలంగాణ కవిమిత్రులు' పూరిస్తాయి. దేవులపల్లి రామానుజరావు మొదట 1951లో 'సుజాత తెలంగాణ సంచిక'లో కొంతమంది ఆధునిక కవులను ప్రస్తావించారు. 1961లో జి.వి.సుబ్రహ్మణ్యం 'వీరరసము' గ్రంథంలో సురవరం, వానమామలై, కాళోజి, భాగి, బూర్గుల, దేవులపల్లి తదితరులని వైతాళిక కవులుగా పేర్కొన్నారు. కానీ వారి గురించి సవివరమైన విశ్లేషణ అందించలేదు. అంతకుముందు కురుగంటి సీతారామయ్య సైతం 'నవ్యాంధ్రసాహిత్య వీధులు' గ్రంథంలో భాగి నారాయణ మూర్తి కవితను కోట్ చేస్తూ కొంత రాసిండు. కానీ అది సమగ్రం కాదు. సురవరం ప్రతాపరెడ్డి విమర్శను తాళలేక ప్రస్తావించిన అంశంగానే దాన్ని చూడాలి.

పాత పత్రికలు, అరుదైన సావనీర్లు, 'స్రవంతి' లాంటి సంకలనాలు, రచయితల స్వీయ సంపుటాలను పరిశీలించి సమగ్రమైన తెలంగాణ కవితా వికాసం, విమర్శ రాయాల్సి ఉన్నది. ఆ రచనకు ఈ 'తెలంగాణ కవిమిత్రులు', ఉదధి 'నివురుగప్పిన నిప్పుకణాలు' (త్వరలో అచ్చు కానున్నది) కచ్చితంగా ఇరుసుగా నిలుస్తాయి. ఈ వ్యాస సంపుటిలో బిరుదురాజు రామరాజు గారు పేర్కొన్నట్లు, ముందుమాటలో డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారు ప్రస్తావించినట్లు తెలంగాణ సాహితీవేత్తలు ప్రచార విముఖులు. ఫోటోల పట్ల కూడా పట్టింపు లేని వారు. అందుకే చాలా మంది ఫోటోలు మనకు అందుబాటులో లేవు. అందుకే ఒకరివి ప్రచురించి మరొకరివి ముద్రించనట్లయితే బాగోదు అనే ఉద్దేశ్యంతో వాటిని ఇందులో జోడించడం లేదు. అందుబాటులో ఉన్న ఫోటోలు ఎట్లాగూ ఇంటర్నెట్‌లో లభ్యమవుతున్నందున అవసరం లేదు అనుకుంటా.

మరుగున పడ్డ వైతాళిక కవులను మననం చేసుకునేందుకు, వారి ఒరిజినల్ సాహిత్యం వెతికి చదవడానికి, పునర్ముద్రించడానికి ఈ 'తెలంగాణ కవిమిత్రులు' పుస్తకం ఒక స్ఫూర్తిగా నిలవాలి. ఆంధ్రా ప్రాంత వైతాళిక కవుల గురించి ప్రతి యేటా జయంతి, వర్ధంతి పేరిట తలచుకుంటూ ఉంటారు. అమ్ముడు పోతున్నాయనేదానితో సంబంధం లేకుండా వారి రచనలను యేటా వివిధ సైజుల్లో పునర్ముద్రిస్తున్నారు. ఎప్పటికీ పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నారు. అందుబాటులో ఉంచడమే గాకుండా పదో తరగతి నుంచి పీజీ వరకు పాఠ్యాంశంగా ఆయా కవులను జోడించేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నారు. తెలంగాణలో ఈ ఉద్యమ స్ఫూర్తి కొరవడింది. అకడెమిషయన్స్ కుంటి సాకులు చెబుతూ వైతాళికలను విస్మరిస్తున్నారు. ఇప్పటికైనా ఈ పరంపరకు తెరపడి, ఇన్నేండ్లు విస్మరణకు గురైన మహానీయులందరూ మళ్ళీ రంగం మీదికి మనసారా కోరుకుంటున్నా. ఇందుకు కవులు, రచయితలు, ఉద్యమకారులు, చరిత్రకారులు అందరూ ఉమ్మడిగా కృషి చేయాలని మనవి.



డా. సంగిశెట్టి శ్రీనివాస్
9849220321

# భయపడిన వామపక్షం జాతీయ అతివాదం చేసే పనిని చేస్తోంది

**అనువాద ఇంటర్వ్యూ**

'ట్రోఫీ' (తెలుగులో ఛాయా ప్రచురణగా వచ్చిన 'వేట') నవల 2022లో 'యూరోపియన్ ప్రైజ్ ఫర్ లిటరేచర్'ను గెలుచుకుంది. ఫ్లెమిష్ రచయిత్రి గేయా స్కోటర్స్ రాసిన నవల యిది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జాతీయ అతివాదం, నయా వలసవాదం, సాహిత్యం ఆమె రచనల్లో విస్తృతంగా చర్చకు వస్తాయి.

NIN కోసం గేయ స్కోటర్స్ (Gaea Schoeters) ఇచ్చిన ఇంటర్వ్యూకు స్వేచ్ఛానువాదం ఇది :

ఆఫ్రికాలో జరిగే బిగ్ ఫైవ్ హంటింగ్ అనబడే పెద్ద జంతువుల వేట నేపథ్యంతో ఈ నవల ఆద్యంతం ఉత్కంఠతో సాగుతుంది. ఆఫ్రికాపైన పాశ్చాత్యుల దృష్టి, పర్యావరణం, పాశ్చాత్య మగ దురహంకారం, నైతికత వంటి అనేక అంశాలను చర్చించే ఈ నవలలో ప్రధాన పాత్ర 'హంటర్ వైట్' (Hunter White) అనే శ్వేతజాతి వేటగాడు.

**1.హంటర్ వైట్ సగటు పాశ్చాత్యుడా?**

-కాదు, ఒక విధంగా అతను నిర్దిష్ట పాశ్చాత్య మనస్తత్వానికి ప్రతినిధి. అతను ఆఫ్రికాకు ప్రయాణిస్తాడు నవలలో ఎక్కడా అది ఏ ఆఫ్రికన్ దేశామో చెప్పలేదు. ఎందుకంటే దేశమేదనేది పట్టింపు లేదు. అతనికి
ఆఫ్రికా ఖండం మొత్తం కేవలం ఒక వేట ప్రదేశం అంతే. విడిగా దేశాల రాజకీయాలు, సామాజిక వాస్తవాల పట్ల అతనికి ఆసక్తి కూడా లేదు. (ఆఫ్రికాలో ఏ దేశమైనా డబ్బు వెదజల్లి తనకు కావలసినది కొనుక్కోవచ్చునని అతని అవగాహన) తన పాశ్చాత్య ప్రపంచ దృష్టికోణమూ, నైతిక విలువలు మాత్రమే
ఉత్తమమైనవి, అవే సరైనవని హంటర్ అభిప్రాయం. అవి ప్రతిచోటా పనిచేస్తాయి వాటిని ఎగుమతి కూడా చేయవచ్చని నమ్ముతాడు. పాశ్చాత్య ప్రపంచం ఆఫ్రికా ఖండాన్ని ఇప్పటికీ ఏ 'శ్వేతజాతీయుల దృక్పథం' తో చూస్తుందో, దానికి అతను ప్రతిరూపం. అటువంటి వ్యక్తి యీ సారి ఖడ్గమృగం వేటకోసం ఆఫ్రికాలో అడుగుపెట్టినపుడు-

- అతని ఆలోచనా విధానం స్థానిక జనాల నైతిక విలువలు, నమ్మకాలతో ఢీకొన్నప్పుడు, అతని మానసిక ప్రపంచం కుప్పకూలిపోతుంది. అదే సమయంలో అతనిలో మరో కోణామూ మీకు కనిపిస్తుంది.

శారీరక బలం ఇకపై ఆధిపత్యానికి కీలకం కాని డిజిటల్ యుగంలో వున్నాం మనం. ఇటువంటి సందర్భంలో తన పురుషత్వాన్ని చాటుకునే మార్గం కోసం అన్వేషిస్తున్న ఆధునిక మానవుడి ప్రతీక అతను. అందుకే, ఆధునిక ప్రపంచపు మరో సాధారణ అంశమైన 'ప్రకృతితో అనుసంధానం' గురించి పదే పదే మాట్లాడుతుంటాడు, ప్రయత్నిస్తుంటాడు

**2.మనమందరం బహుశా హంటర్ వైట్ లాంటి వాళ్ళమేనా?**

-ఒక రకంగా చెప్పాలంటే అవును. అతను మనందరిలోనూ వున్నాడు. వలసవాదం, విషపూరిత మగ దురహంకారం అనేవి సుదూర గతం నుండి వచ్చిన విషయమని అనుకుంటాం. ఆ మనస్తత్వం మనలో లేదు ఇతరులతో మాత్రమే వుంది. ప్రగతిశీల ప్రజలమైన మనం వాటికి చాలా దూరంగా ఉన్నామని అనుకోవడానికి ఇష్టపడతాము.

అది నిజంగానే అంత నిజమా? మనకు ఆఫ్రికా గురించి ఏం తెలుసు. (మనలో ఎంతమంది ఆఫ్రికా యొక్క ఖాళీ పటాన్ని సరిగ్గా పూరించగలరు?) మనకు అక్కడి వాస్తవాలు ఏం తెలుసని? హెమింగ్వే, కారెన్ బ్లిక్సన్ పుస్తకాలు చదివి ఆఫ్రికాను చాలా రొమాంటిక్ గా ఊహించుకుంటాం. (హెమింగ్‌వే మరియు కారెన్ బ్లిక్సన్ మనలో నింపిన నారింజ రంగు సూర్యాస్తమయాలు ఎంతవరకు సుపరిచితం?)

నల్లజాతి శరీరాలను కేవలం లైంగిక వస్తువులుగా చూసే మూస ధోరణిలోకి మనం ఎంత సులభంగా జారిపోతాము?

మనిషి ప్రకృతిలో భాగం కాదు, దానికి అతీతుడని అనుకునే హంటర్ దృక్కోణాలు మన ఆలోచనా విధానంలో అచేతనంగా ఎంత లోతుగా పాతుకుపోయాయి?

నవల రాస్తున్నప్పుడు ఆ మూస ధోరణులను నేను ఎంత సులభంగా ఎదుర్కొన్నానో చూసి ఆశ్చర్యపోయాను. పాఠకులు కూడా హంటర్ ఆలోచనా విధానంలోకి ఎంత సులభంగా ప్రవేశిస్తారో చూసి దిగ్భ్రాంతి చెందుతారని నేను నమ్ముతున్నాను. తుపాకీ కాల్పుల శబ్దం విన్నప్పుడు, వారి బూట్లపై రక్తం మరకలు చూసినప్పుడు మాత్రమే తాము దారి తప్పి ఎంత దూరం వచ్చామో గ్రహించక నిజంగా భయమౌతుంది

**3. ప్రపంచం 3ఇంకా వలసవాద స్థితిలో ఉందా లేక వలసానంతర స్థితిలో ఉందా?**

ఇతర దేశాలను స్వాధీనం చేసుకోవడానికి ఇప్పుడు ఎవ్వరూ సైన్యంతో ప్రవేశించడం లేదు...కనీసం ప్రతిసారీ కాదు.. (బహుశా ఈ మాట వెనిజులా విషయంలో నిజమైందేమో: అను ) కానీ తమ ప్రయోజనం కోసం రాజకీయ వ్యవస్థలను( తమ అనుకూల ప్రభుత్వాలను) స్థాపిస్తున్నారు లేదా ఉన్న రాజకీయ వ్యవస్థలను అస్థిరపరుస్తున్నారు. పశ్చిమ దేశాలు (అమెరికా, రష్యా, చైనా, సౌదీ వంటివి) ఆర్థిక సహాయం అందించడం ద్వారా, కంపెనీలను, వనరులను, భూమిని కొనుగోలు చేస్తున్నాయి. తద్వారా ఆఫ్రికా దేశాలలో తమ ప్రభావాన్ని వేస్తున్నాయి, పొందబోయే లాభాలను దృఢ పరుచుకుంటున్నాయి. ఇందులో
పర్యావరణ వలసవాదం కూడా ఉంది, పశ్చిమ దేశాల కంపెనీలు ఇప్పటికే ఉన్న వన్యప్రాణి పార్కులను లేదా భూమిని కొనుగోలు చేసి వాటిని పర్యావరణ నిల్వలుగా మారుస్తున్నాయి. యిలా ఇతర దేశాలలోని పెద్ద పెద్ద భూభాగాలపై నియంత్రణ సాధిస్తాయి. అందులో ఎవరికి ప్రవేశం ఉందో, ఏ చట్టాలు వర్తిస్తాయో కూడా తామే నిర్ణయిస్తాయి. మనం( పాశ్చాత్య ప్రపంచం) ఇప్పటికీ మనకు అవసరమైనవి ఆఫ్రికా ఖండం నుండి తీసుకుంటూ, పర్యావరణ సమస్యలను మాత్రం దక్షిణార్ధ గోళానికి బదిలీ చేస్తున్నాము. నేను దీనిని వలసానంతర స్థితి అని పిలవను.

**4. చివరిదైన నార్త్ తెల్ల ఖడ్గమృగం ( మగజంతువు) ఇటీవల మరణించింది. కొన్ని నల్ల ఖడ్గమృగాలను మొజాంబిక్‌కు తరలించారు, (అక్కడ అవి గతంలో అంతరించిపోయాయి). అందుకేనా ఈ నవలలో ఖడ్గమృగం వేట వస్తువైంది ?**

ఖడ్గమృగం "బిగ్ ఫైవ్" ట్రోఫీలలో ఒకటి.( ఐదు ఆఫ్రికన్ జంతువులైన పులి, సింహం, అడవిదున్న, ఏనుగు, ఖడ్గమృగాలను వేటాడటం శ్వేతజాతి పాశ్చాత్య ధనిక వర్గానికి సరదా ). అది అత్యంత అరుదైనది, ప్రత్యేకమైనది, అది ఎప్పుడూ వేటగాళ్ల లక్ష్యమే.

ఒక అమెరికన్ పారిశ్రామికవేత్త ఒక నల్ల ఖడ్గమృగాన్ని వేటాడుతూ CNN చానల్ ను తన వెంట రావడానికి అనుమతించాడు, బహుశా నవలలో ఒక వస్తువు ఖడ్గమృగం అయ్యే నా నిర్ణయానికి అది ప్రేరణ అయి ఉండవచ్చు. నిజానికి ఖడ్గమృగం ఒక ఆకర్షణీయమైన జీవి. వేల




ఏళ్ల గతం వున్న జంతువు. పురాతన, మార్మిక తేజస్సుతో వ్యక్తిగతంగా నన్ను కూడా ఆకర్షించింది.

**5.మన మానవకేంద్రిత దృక్పథం, అత్యాశ నుండి ఈ గ్రహం మనుగడ సాగించగలదా?**

పర్యావరణ తత్వవేత్త వాల్ ప్లమ్‌వుడ్ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను:

మనం ఇంకే మాత్రమూ (ఇతర జంతువుల) వేటకు ఎర కాదు, మనమే వేటగాళ్ళం అనుకొని మానవాళి తనను తాను ఆహార గొలుసు వెలుపల ఉంచుకున్నప్పుడే మన సమస్యలు మొదలయ్యాయి. మనలను మనం ప్రకృతిలో ఒక భాగంగా కాకుండా, బలంతో లేదా సాంకేతికతతో ప్రకృతిని నియంత్రించగల శక్తిగా మనలను మనం అంచనా వేసుకోవడంతో కూడా సమస్యలు మొదలయ్యాయి. వాతావరణంతో సమస్య ఉందని మనం అనుకుంటాం, కానీ వాస్తవం దానికి వ్యతిరేకం. సమస్య వాతావరణానికి కాదు, మనకే ఉంది. (వాటిదేముంది మానవజాతి అంతం తర్వాత భూమి, వాతావరణం మళ్లీ కోలుకుంటాయి.)వీలయినంత త్వరగా మన గమనాన్ని మార్చుకోకపోతే అనివార్యంగా జరిగేది ఇదే. పరిమితమైన పర్యావరణంలో అనంతమైన మానవ ఎదుగుదల అసాధ్యం. ఇదిఅర్థం చేసుకోవడానికి ప్రత్యేక మేధస్సు అవసరం లేదు. ప్రస్తుత వ్యవస్థ అతి కొద్దిమంది ధనవంతుల మనుగడ (సంపద) కోసం అణగారిన వర్గాలను ఒక వనరుగా మార్చడం ద్వారా విస్తరిస్తోంది.

తమ భవిష్యత్తు కాలపరిమితితో కూడుకున్నదని వారికి కూడా తెలుసు. సమయం ఆపై ప్రకృతి "తిరిగి దెబ్బకొడుతుంది," అప్పుడు తెలుస్తుంది మనం పర్యావరణ వ్యవస్థలో ఒక భాగమే తప్ప, దానికి అతీతులం కాదని. వాతావరణ సంక్షోభం మనపై ఎంత తీవ్రంగా విరుచుకుపడుతుంది అంటే వరుస ప్రకృతి వైపరీత్యాలను నివారించలేక నిస్సహాయులం అవుతాము. నిజానికి, "తిరిగి దెబ్బకొట్టడం" అనేది సరైన పదం కాదు: ఇందులో ప్రతీకార స్వభావం ఏమీ లేదు. ప్రకృతి కేవలం "ఉంది"— అది మానవ జోక్యం లేకుండా స్వతంత్రంగా పర్యావరణ సమతుల్యతను పునఃస్థాపిస్తుంది.

**6.ప్రపంచంలో జాతీయ అతివాదం బలపడటం నుండి మీరు ఏమి ఆశిస్తున్నారు?**

దురదృష్టవశాత్తు, ఇది మరో నిరాశావాద సమాధానం. కుడివైపుకు ( జాతీయ అతివాదం వైపుకు) మొగ్గు చూపడం అనేది ఒక వ్యవస్థ తన పరిమితులను చేరుకుంటోందనడానికి రుజువు. మనం నివసిస్తున్న ఈ అతిపెట్టుబడిదారీ, వినియోగవాద వ్యవస్థ
(దేశం ఆర్థిక వ్యవస్థ అంతా కొనుగోళ్లు, అమ్మకాలు, బ్రాండ్లు వంటి భౌతిక సుఖాల చుట్టూ తిరుగుతుంటే, దాన్ని 'కన్స్యూమరిస్ట్ స్టేట్' అనవచ్చు:అను) అనంతంగా విస్తరించలేదు. కనీసం దాని ప్రజాస్వామ్య రూపంలోనైనా అది ముగింపు దశకు చేరుకుంటోంది. నిరంకుశ నాయకులపై ఆధారపడి మనుగడ సాగిస్తూ ఈ వ్యవస్థ తన వికార రూపాన్ని మరింత బహిర్గతం చేస్తోంది. ఈ నాయకులు యథాతథ స్థితిని కొనసాగిస్తారని, దేశ సంపదను, భద్రతను కాపాడతారని నమ్మే ప్రజల చేతనే వారు ఎన్నుకోబడటం ఒక విరోధాభాస. కానీ వాస్తవానికి వారు అధికారశ్రేణిలో అగ్రస్థానంలో వుండి తమ స్వప్రయోజనాలను, తమ మిత్రుల ప్రయోజనాలను మాత్రమే కాపాడుతున్నారు. అత్యంత దారుణం ఏమంటే, దీనికి వ్యతిరేకంగా ఎలాంటి ఉద్యమమూ లేదు. తమకు (నిజమైన) అధికారం ఉందని పౌరులు మరిచిపోయారు. మధ్యేవాద, వామపక్ష పార్టీలన్నీ ఎన్నికల ఓటమి భయంతో, జాతీయ అతివాదులకు అధికారాన్ని అప్పగించకూడదనే తీవ్ర ప్రయత్నంలో, తమ అజెండాను నిర్దేశించడానికి, విధానాల అమలుకు జాతీయ అతివాదులకు అవకాశం ఇస్తున్నాయి. ఇది జాతీయ అతివాదులకు రెట్టింపు విజయం: వారు పాలించాల్సిన పని లేదు (కాబట్టి సమస్యలు పరిష్కారం కాకపోతే వారిని నిందించకూడదు) అంతేకాదు వారికి అవసరమైన విధానాలను ఇతరులే అమలు చేసి పెడతారు. "ట్రోఫీ"నవల ఒక సన్నివేశంలో జీపు డ్రైవర్ జీన్స్ వేటగాడు వైట్ హంటర్‌తో ఇలా అంటాడు: "ఖడ్గమృగాన్ని చంపినవాడు స్మగ్లర్ అయినా, చట్టబద్ధమైన వేటగాడు అయినా ఆ జంతువుకు పట్టింపు లేదు— అది చనిపోతుంది. సమాజంలోని బలహీన వర్గాల విషయంలో కూడా ఇదే నిజం: నిర్ణయాలు మధ్యేవాదులు తీసుకున్నా, తీవ్ర కుడిపక్షం( జాతీయ అతివాదులు) తీసుకున్నా తేడా ఏమీ ఉండదు. ఈ విషవలయమే నా కొత్త పుస్తకం "ది గిఫ్ట్" ఇతివృత్తం. అందులో, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బోట్స్వానా అధ్యక్షుడు బహుమతిగా 20,000 ఏనుగులను బెర్లిన్‌లో ప్రవేశ పెడతాడు...

**7. "ట్రోఫీ"నవలలో ఆడ పాత్రలు ఎందుకు లేవు? (నవలలో నేరుగా వచ్చే స్త్రీ పాత్రలు లేవు. ఒకటి రెండుచోట్ల హంటర్ వైట్ జ్ఞాపకల్లో అతని భార్య ప్రస్తావన వుంటుంది :అను)**

వేటకు వెళ్ళే ముగ్గురు మౌన పురుషుల కథ యిది. వారు తమ నిజమైన భావాలను బయటపెట్టరు—లేకపోతే, ఈ కథ అసలు జరగదు. కథ ఒక్కో పొర విప్పబడాలంటే వేటగాడు ఒంటరిగా ఉండాలి. ఒకవేళ అతను ఎవరితోనైనా మాట్లాడితే, ఏమి జరుగనుందో అతనికి తెలిసిపోతుంది. ఒక విధంగా అతను పిచ్చిపట్టేంత ఒంటరితనపు భావనతో తన ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. అంతేకాదు ఇది తమ పౌరుషం నిరూపించుకోడానికి మగవాళ్ళు చేసే అన్వేషణ కాబట్టి, కథానాయకులు పురుషులుగా ఉండటం అవసరం. ట్రోఫీల కోసం బిగ్ హంటింగ్ చేసే మహిళలు చాలా అరుదు కేవలం మూడు శాతం మంది మాత్రమే ఉంటారు. అలా వెళ్ళేవాళ్ళు దాదాపు అందరూ తమ భర్తలతో కలిసి ఈ వేట చేస్తారు.

**8. మీరు ఆఫ్రికాను సందర్శించలేదు కానీ నవలలో అక్కడి ప్రకృతి, ఆచారాల గురించిన మీ వర్ణనలు వాస్తవికంగా వున్నాయి ?**

- నవల రాయటానికి ముందు రెండు సంవత్సరాలు పూర్తిగా పరిశోధనకే అంకితమై సమాచారాన్ని సేకరించాను. ప్రతి వివరమూ తెలుసుకోవాలనుకున్నాను. ఒకవేళ వేటగాడు మంటల దగ్గర నిద్రపోయి, తెల్లవారు జామున మూడు గంటలకు మేల్కొంటే, అతను ఏ జంతువుల అరుపులు, కీటకాల రోదలు వింటాడు? ఆ సమయంలో ఏవైనా పక్షులు మేల్కొని ఉంటాయా? వాటి అరుపులు ఎలా ఉంటాయి? ఇవి తెలుసుకోవాలను కున్నాను. అదృష్టవశాత్తూ యీ సమాచారం ఇంటర్నెట్ లోవుంది. రాత్రి ఏ సమయంలోనైనా ఆఫ్రికన్ ఉష్ణ మండల గడ్డి భూముల్లో వినిపించే శబ్దాలతో సహా, అత్యంత విచిత్రమైన విషయాలను కూడా ఇంటర్నెట్‌లో పోస్ట్ చేసే వ్యక్తులు ఉన్నారు. గత వలసవాద కాలంలోని వృత్తిపరమైన వేటగాళ్లు రాసిన నవలలలో కూడా నేను చాలా విషయాలు కనుగొన్నాను, అది వేటగాళ్ల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడింది. అక్కడి ప్రజల గురించి తెలుసుకోడానికి పరిశోధన చేయడం మాత్రం సంక్లిష్టమైనది:నవలలోని "డేవిడ్, ఇంకెట్ " పాత్రలకు మూలమైన ఆఫ్రికన్ మూలవాసుల గురించి తెలుసుకోడానికి డాక్యుమెంటరీలు, మానవశాస్త్ర, భాషా శాస్త్ర అధ్యయనాలపై ఆధారపడ్డాను, ఎందుకంటే భాష మానవ ఆలోచనల గురించి చాలా విషయాలు చెబుతుంది. నిజానికి ఆఫ్రికాకు ప్రయాణించాలని ప్రణాళిక వేసుకున్నాను, కానీ అప్పుడు కోవిడ్ వచ్చింది. వెళ్లనందుకు ఇప్పుడు సంతోషిస్తున్నాను— సాధారణంగా మన పరిశీలనల యొక్క నిష్పాక్షికతను మనం అతిగా అంచనా వేస్తాం. కొన్నిసార్లు మనం అనేక వనరుల నుండి (పరస్పర విరుద్ధమైన) సేకరించిన సమాచారాన్ని పోల్చినప్పుడు మనకు మెరుగైన చిత్రం లభిస్తుంది (అభిప్రాయం ఏర్పడుతుంది). ఒకవేళ నేను నా పాత్రలను కలుసుకుని ఉంటే, ఆ పాత్రలకు నేను ఇప్పుడు చేసిన న్యాయం చేయగలిగేదానినో లేదో కూడా నాకు ఖచ్చితంగా తెలియదు. నాకూ ఆఫ్రికాకూ వున్న దూరం సహాయపడింది.

**9. మీరు ఇరాన్, మధ్య ఆసియా, మరియు అరేబియా ద్వీపకల్పం గుండా ఏడు నెలల పాటు సైకిల్‌పై ప్రయాణించి ఒక పుస్తకం రాశారా?**

అదొక అద్భుత ప్రయాణం. నన్ను శాశ్వతంగా మార్చేసింది. బండిలో పెట్రోల్ లీక్ అయితే దాన్ని ఎలా సీల్ చేయాలి! సముద్రమట్టానికి 4,500 మీటర్ల ఎత్తులో వంట ఎలా చేసుకోవాలి? వంటి ఆచరణాత్మక విషయాలు చాలా తెలిశాయి. ప్రపంచాన్ని మనం చూసే పద్ధతి మాత్రమే ఎల్లప్పుడూ ఉత్తమమైనది కాదని అది నాకు చూపింది. మన జీవనవిధానం కేవలం ఒక ఎంపిక మాత్రమే. ప్రయత్నపూర్వకంగా మనం దాన్ని మార్చుకోవచ్చునని చెప్పింది. 99 శాతం మంది ప్రజలు మంచి వారు,మనమంతా కోరుకునేది ఒకటే : సంతోషంగా జీవించడం, రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తును అందించడం. మనం చాలా ముఖ్యమైనవిగా భావించే అనేక విషయాలు నిజానికి ప్రాముఖ్యత లేనివి. మనం పట్టించుకోని అనేక విషయాలకు నిజమైన విలువ ఉంది. మనకు యాదృచ్ఛికంగా కొన్ని కలిసివచ్చాయి. ఒకచోట నుంచి మరోచోటికి ప్రయాణించే స్వేచ్ఛ ఉంది. ఎక్కడ నివసించాలో ఎంచుకోవడానికి అనుమతినిచ్చే పాస్‌పోర్ట్‌తో జన్మించడం వల్ల మనం చాలా అదృష్టవంతులం. చాలా మందికి ఆ స్వేచ్ఛ లేదు. కేవలం వారు పుట్టిన ప్రదేశం అనే ప్రపంచ లాటరీలో దురదృష్టవంతులు కావడం వల్ల వాళ్ళా స్వేచ్ఛ పొందలేకపోయారు.

ఈ ప్రయాణపు అద్భుతమైన అనుభవాలు కూడా నాకు గుర్తున్నాయి. ఇరాన్‌లో స్త్రీ పురుషులతో జరిపిన అంతులేని సంభాషణలు( అక్కడ టీ ఎప్పటికీ చల్లబడదు, సంభాషణలు ఆగవు.) తజికిస్తాన్‌లోని బీడు పీఠభూములంటారా? అది నేను మరెక్కడా వినని ఒకరకమైన నిశ్శబ్దం. యెమెన్‌లో లభించిన ఆత్మీయ స్వాగతాలు (అక్కడ మాతో మాట్లాడాలనే కుతూహలంతో ఒక స్థానిక సంస్థలోని పురుషుల విభాగానికి మమ్మల్ని ఆహ్వానించారు.) కాంతి కాలుష్యానికి దూరంగా, పర్వతాకాశంలో లెక్కలేనన్ని నక్షత్రాలు... అద్భుతం. అయితే, అన్నీ అంత రొమాంటిక్‌గా ఏమీ లేవు. 48 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఎడారిలో పడిన కష్టాలు, చెడిపోయిన ఆహారం తిని మళ్ళీ అనారోగ్యానికి గురవడం, నిద్రపోవడానికి చోటు వెతకడం కోసం సైకిల్‌పై గడిపిన అంతులేని గంటలు, గుడ్డి మలుపుల్లో ఓవర్ టేక్ చేసే డ్రైవర్లతో కూడిన ప్రమాదకర పర్వత రహదారులు నాకు గుర్తున్నాయి...

అంత సులభం కానప్పటికీ, ఆ ఏడు నెల కాలంలో మాకు ఎప్పుడూ నిజమైన సమస్య రాలేదు— ఏదో చెప్పి కొన్ని ప్రాంతాలు ప్రమాదకరమైనవి అని నమ్మించాలనుకుంటున్న కొందరి మాటలకంటే యీ ప్రపంచం నిజానికి చాలా సురక్షితమైనదని ధృవీకరించింది.

**10. సమకాలీన ఐరోపా కపటమైనదీ, తను ప్రకటించిన విలువలను కేవలం మాటల వరకు మాత్రమే సమర్థిస్తుందని మీరు అంగీకరిస్తారా?**

- దురదృష్టవశాత్తు, ఈ రోజుల్లో, సమాధానం అవుననే ఉండాలి.

**11. రాబోయే 50 లేదా 100 సంవత్సరాలలో ప్రపంచం ఎలా ఉండవచ్చని మీరు అనుకుంటున్నారు?**

- అంత ఆశాజనకంగా ఉండదు. అది ఎంపిక కాబడిన కొద్దిమందికి మాత్రమే అనుకూలంగా ఉంటుంది, మెజారిటీ ప్రజలకు తక్కువ అనుకూలంగా లేదా ఇప్పటికంటే మరింత అధ్వాన్నమైన పరిస్థితులలో ఉంటుంది. ఇదంతా ఆయుధాల కోసం కేటాయించే ఆ ఐదు శాతంతో మొదలవుతుంది ( నాటో కూటమిలోని ప్రతీ దేశం తమ దేశ జి. డి.పి. లో 5 శాతం ఆయుధాలకు కేటాయించాలని నాటో ఒప్పందం:అను) మురకామి ఇలా రాశారు: కొనుగోలు చేసిన ప్రతి ఆయుధం ఏదో ఒక సమయంలో ఉపయోగించబడుతుంది. పెద్దవి, మరింత శక్తివంతమైన ఆయుధాలను కొనుగోలు చేయడాన్ని యుద్ధ నివారణ* అని ఎలా అంటారో నాకు అర్థం కావడం లేదు, ఎందుకంటే అది వాస్తవానికి పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుంది. చివరికి దౌత్యం ఎప్పుడూ వస్తుంది— మధ్యలో ఉండే ఆదిమ దశ అయిన యుద్ధాలను మనం దాటవేయలేమా? అన్నది ప్రశ్న. మనం వ్యవస్థాగత పతనం వైపు పయనిస్తున్నట్లు అనిపిస్తోంది. కాంక్రీట్ గోడ వైపు దూసుకుపోతున్న రైలును ఆపి వేరే దిశకు మళ్లించ మనం ప్రయత్నించవచ్చు, లేకపోతే అది నిరంకుశ పాలనలు, యుద్ధం, మరియు వాతావరణ విపత్తుల వైపు శరవేగంగా దూసుకుపోవచ్చు...

**12. కళ సామాజికంగా మమేకమై ఉండాలా?**

కళకు స్వేచ్ఛ ఉంటుంది, అది ఏ పనీ విధిగా "చేయాల్సిన" అవసరం లేదు. నేను సామాజికంగా చురుకుగా ఉంటాను కాబట్టి అటువంటి ఇతివృత్తాలు నా నవలల్లో తరచుగా కనిపిస్తాయి. మనకు ముఖ్యం అనిపించిన విషయాల గురించే మనం రాస్తాము. రచనలో సృజనాత్మక కల్పన కీలక పాత్ర పోషించగలదు. మొదట వార్తలలోని అన్ని భయంకరమైన విషయాల నుండి మనల్ని మనం మరుగు పరచుకోవడం నేర్చుకున్నాం. కల్పన ఆ రక్షణ కవచాన్ని ఛేదించగలదు, ఎందుకంటే లోపలి నుండి చూసే దృక్పథం మనల్ని కథానాయకుడి మనసులో నిలబెడుతుంది, తద్వారా మనం సహానుభూతి చెందగలం. ఆ ఇతివృత్తాలతో భావోద్వేగాలపరంగా అనుసంధానమవుతాం. రెండవది, నిజ జీవితంలోని చాలా సున్నితమైన లేదా బాధాకరమైన విషయాలను చర్చించుకోవడానికి కల్పన ఒక సురక్షితమైన ప్రదేశం. ఎల్లప్పుడూ మన అభిప్రాయమే సరైనదనే కోణం నుండి బయటకు వచ్చి నిజంగా సంభాషించవచ్చు, బహుశా మన అభిప్రాయాలను మార్చుకోవచ్చు కూడా.



ఇంటర్వ్యూ తెలుగు అనువాదం: శ్రీనివాసమూర్తి
వేట (నవల): ఫ్లెమిష్ మూలం : గేయ స్కోటర్స్
తెలుగు అనువాదం : కుమార్. ఎస్
ప్రచురణ : ఛాయా ప్రచురణలు, వెల: 325 రూ.



# జంగిలి రవీందర్‌కు కన్నీటి నివాళి

- **మందమర్రిలో విషాద ఛాయలు.. ఘనంగా దశదిన కర్మ**
- **హాజరైన మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గడ్డం అరవింద్ రెడ్డి, ప్రముఖ యూనియన్ నేతలు**
- **ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆయన పోరాట స్మృతులను నెమరువేసుకున్న నాయకులు**

**మందమర్రి, మహా :** మందమర్రి కార్మిక క్షేత్రంలో ఉద్యమాలకు, ప్రజా సేవకు నిలువుటెత్తు రూపంగా నిలిచిన దివంగత నేత జంగిలి రవీందర్ అకస్మాత్తుగా మన మధ్య లేకపోవడం తీరని లోటని నాయకులు ఉద్వేగానికి గురయ్యారు. గత 9 రోజుల క్రితం అనారోగ్యంతో పరమపదించిన రవీందర్ దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో అత్యంత భావోద్వేగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, మందమర్రి ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ తదితరులు విచ్చేసి రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ కూడా హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో జంగిలి రవీందర్ ముందుండి చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. మందమర్రి భారత రాష్ట్ర సమితి పట్టణ అధ్యక్షుడిగా ఆయన అందించిన అమూల్యమైన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని అన్నారు. కార్మికుల హక్కుల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని స్మరించుకున్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేనప్పటికీ, ఆయన ఆత్మీయ పలకరింపులు, పోరాట స్మృతులు ఎప్పుడూ అందరి మదిలోనే నిలిచిపోతాయని కన్నీరు పెట్టుకున్నారు.

**కుటుంబానికి అండగా ఉంటాం**

కష్టకాలంలో ఉన్న రవీందర్ కుటుంబ సభ్యులకు నాయకులందరూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి యూనియన్ పరంగా, వ్యక్తిగతంగా ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతుడు రవీందర్ అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ స్థానికులు, తోటి కార్మికులు, నాయకులు ఆయన నిద్రపోతున్న జ్ఞాపకాలతో భావోద్వేగానికి గురయ్యారు.



# చికిత్స పొందుతున్న విలేకరి సతీమణికి ఎమ్మెల్యే పరామర్శ

**ఉష ఆరోగ్య పరిస్థితిపై సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఆరా..**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 20:మహా :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవతా దృక్పథాన్ని చాటుకోవడంలో ముందుండే సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌లోని జయంతి మల్టీ స్పెషాలిటీ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న సత్తుపల్లి ప్రముఖ విలేకరి షేక్ ఖాదర్ బాబా సతీమణి ఉషాను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఉషా ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య సేవలు, చికిత్స వివరాలపై ఆరా తీశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉషాకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కష్టకాలంలో ఉన్న కుటుంబాలను పరామర్శించడం, వారికి మనోధైర్యం కల్పించడం కూడా తన బాధ్యతగా భావిస్తున్నాననే సందేశాన్ని ఎమ్మెల్యే తన చర్య ద్వారా చాటుకున్నారు. బాధిత కుటుంబాల పట్ల ఆప్యాయత, ప్రజల పట్ల బాధ్యత, ఆపదలో అండగా నిలిచే మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తున్న తీరును ఈ పరామర్శ ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



# అంబేద్కర్ అభయహస్తం అమలు చేయాలి

- **ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలి**
- **ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వ్యవసాయ కార్మిక సంఘం నేత జాజిరి శ్రీనివాస్**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 20:మహా :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేయకుండా 'అంబేద్కర్ అభయహస్తం' పథకాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గంగారంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల వేదికగా ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో అంబేద్కర్ అభయహస్తం కింద ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రతి ఏడాది బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయిస్తామని కూడా ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు భూమి, ఇల్లు, ఉపాధి, విద్య, స్వయం ఉపాధి వంటి మౌలిక అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రకటించిన రూ.12 లక్షల ఆర్థిక సాయం కీలకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో పలు కేటాయింపులు చేసినప్పటికీ, అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం హామీ అమలు ఏ దశలో ఉందో ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రభుత్వ విధానాలుగా అమల్లోకి రావాలని అన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాలంటే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కావూరి వెంకటేశ్వరరావు, మోదుగు వెంకటేశ్వరరావు, పులిజాల సురేందర్, రాంబాబు, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల సంక్షేమమే లక్ష్యం..

- **రూ.6.8 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**
- **లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే పాయం..**



**మణుగూరు, మహా :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.6.8 లక్షల విలువైన చెక్కులను మండలానికి చెందిన లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినాకి నవీన్, నాయకులు పాతూరి వెంకన్న, అబ్దుల్లా, అప్పారావు, తిరుమలేష్, చింతల కృష్ణ, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.





# వినోబానగర్‌లో విషాదం

- **కారు డోర్ లాక్ అయ్యి చిన్నారి మృతి**
- **కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధిలోని వినోబానగర్ గ్రామంలో ఆదివారం విషాద ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ దంపతుల ముద్దుల కూతురు తన్వి శ్రీ (5) సంవత్సరాల పాప కారు ఎక్కి ఆడుకుంటూ ప్రమాదవశాత్ డోర్ లాక్ అవడంతో ఊపిరాడక చనిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు తన్వి శ్రీని ఆసుపత్రికి తరలించగా అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో గంగావత్ నవీన్ కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగింది. ఈ సంఘటనతో వినోబా నగర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హుటాహుటిన నవీన్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు. మండలానికి చెందిన పలు పార్టీల ముఖ్య నాయకులు నవీన్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి సానుభూతిని తెలిపారు.

## ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ భార్య

**హనుమకొండ, మహా ;** హనుమకొండ, సుబేదారి ప్రాంతం రెవెన్యూ కాలనీ నాగేంద్రనగర్ కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ బిర్రు అనిల్ భార్య శిరీష(36) ఇంటి సెల్లార్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హెడ్ క్వార్టర్స్ ఫింగర్ ప్రింట్ విభాగంలో పనిచేస్తున్న అనిల్తో ఆమెకు 2014లో వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులు, దంపతుల మధ్య కలహాలే కారణమని తెలుస్తోంది. మృతురాలి తండ్రి వెంకన్న ఫిర్యాదుతో సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి





**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** డిసెంబర్ నెలలో జరిగే టీఎస్ యుటిఎఫ్ ఏడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ లు విజ్ఞప్తి చేశారు. మహాసభల సందర్భంగా ఆదివారం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం కొత్తగూడెంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రతి రెండు సంవత్సరాలకు జరిగే రాష్ట్ర మహాసభలు ఈ సంవత్సరం డిసెంబర్ 26, 27, 28 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో గల కొత్తగూడెం క్లబ్ జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ విద్యా రంగం మునుగడ కోసం పరిరక్షణ కోసం నిరంతరాయంగా పనిచేసే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభలు విజయవంతం చేయాలని కోరారు.

**మహాసభల ఆహ్వాన సంఘ సభ్యులు..**

రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులుగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులు కోనేరు పూర్ణచంద్రరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు బి.రాజు, ప్రధాన కార్యదర్శి **ఎం.వెంకటేశ్వర్లు, కోశాధికారి** బి.మురళీమోహన్, చీఫ్ ప్యాట్రన్ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు ఎస్.కె సాబీర్ పాషా, ప్యాట్రన్స్ గా బుక్య శాంతి విద్యానగర్ సర్పంచ్, వాసిరెడ్డి మురళి వైస్ సర్పంచి, జేఏసీ నాయకులు రామారావు, వెంకట పుల్లయ్య, రమేష్ కుమార్ మక్కాడ్, ప్రభు దయాల్, భార్గవ్ చైతన్య, మాధవరావు, నీరజ, బాలాజీ, పద్మలత, మంగీలాల్ సహాధ్యక్షులుగా దుర్గ భవాని, సమ్మారావు, మల్లారెడ్డి, పి.నాగేశ్వరరావు, నరసింహారావు, రాందాస్, కిషోర్ సింగ్, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రాజయ్య, వెంకటేశ్వర్లు, జి.రాయశేఖర్ ఎం.వీరబాబు, జీవి మల్లేశ్వరరావు, కళ్యాణం నాగేశ్వరరావులు ఉన్నారు. వీరితోపాటు జిల్లా ఆఫీస్ బేరర్లు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సబ్ కమిటీల కన్వీనర్లు కార్యదర్శులుగా ఉంటారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలామ్ వెంకట్, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గ భవాని, ఎం రాజశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కార్యదర్శులు, రంజిత్ కుమార్, శ్రీధర్, సింహాచలం, వెంకటప్ప, రవికుమార్, సమ్మారావ్, నాగేశ్వరరావు, వెంకటేశం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.మురళీమోహన్, ఎం.వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శులు, సీనియర్ నాయకులు ఎస్.కె దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# వినీత్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి



- **ముమ్మాటికీ హత్యే.. ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నాలు ఆపాలి**
- **ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుల డిమాండ్**



**సత్తుపల్లి, సెప్టెంబరు 20:మహా :** బొడ్డు వినీత్ (28) మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దురిగంటి అంజయ్య మాదిగ డిమాండ్ చేశారు. వినీత్‌ది ముమ్మాటికీ హత్యేనని, ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం సత్తుపల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వినీత్ తల్లిదండ్రులు బొడ్డు సుబ్బారావు, బొడ్డు సునీలతో కలిసి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 13న తెల్లవారుజామున సత్తుపల్లి పట్టణంలోని రఘురాం ఆసుపత్రి ఎదుటి భవనం వద్ద జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. సంఘటన జరిగి దాదాపు 40 రోజులు గడిచినా కేసులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినీత్ మృతికి సంబంధించి అరవింద్, సుధీర్, జ్యోతి అనే వ్యక్తులను సమగ్రంగా విచారించి, దర్యాప్తులో నేరం రుజువైతే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ స్థానిక పోలీసులు దర్యాప్తులో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం జరగకపోతే ఖమ్మం జిల్లా పోలీసు కమిషనర్‌ను కలిసి తమ ఆవేదనను తెలియజేస్తామని, అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తామని నాయకులు తెలిపారు. వినీత్ మృతికి కారకులుగా అనుమానిస్తున్న సుధీర్, జ్యోతి, అరవింద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించాలని తల్లిదండ్రులు కోరారు. న్యాయం జరగని పక్షంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కొలికపోగు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నాయకుడు గొల్లమందల ముత్తారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు తడికమళ్ల దాసు, ఏపీ రాష్ట్ర నాయకులు అద్దేపల్లి సాగర్, సొరగుడి రాజేష్, గంధం పాండు, నందిగామ అఖిల్, అభిపాల్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## దళారుల చేతిలో రైతులు మోసపోకండి

**దమ్మపేట ,మహా :** మండలంలో భూముల సమస్యలు రోజురోజుకు భీభత్సంగా పెరుగుతున్న క్రమంలో దళారీ వ్యవస్థ చేతిలో రైతులు మోసపోవద్దని యస్.ఐ.రాజేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పట్టణ కేంద్రానికి చెందిన ఓ రైతుకు తన వ్యవసాయ సాగు భూముల ను రిజిస్ట్రేషన్ చేయించి పట్టా దారుగా పాస్ బుక్ లు చేపిస్తామని నమ్మబలికి క్రమ క్రమంగా లక్షల్లో నగదు వసూలు చేశారని యసై తెలిపారు. అట్టి వారి చేతిలో ఆ రైతు మోసపోయానని తెలుసుకొని అతని ఫిర్యాదు మేరకు ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఒక మాజీ సర్పంచ్ నే బురిడీ కొట్టించారంటే , సామాన్య రైతులను దళారులు ఎంత సులువుగా మోసం చేస్తారో బాదితులు గ్రహించాలని హితవుపలికారు. నేరుగా రైతులు రెవిన్యూ అధికారులతోనే సంప్రదించి ,అధికారికంగా భూ లావాదేవీలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇప్పటికే ఈ మండలంలో తరచుగా భూ సమస్యలతో రైతులు స్టేషన్ ల చుట్టూ ,కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కాలాన్ని వృధా చేసుకోకుండా సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకునేందుకు సిద్దపడాలని ,దళారీ వ్యవస్దలను నమ్మి మోసపోవద్దని యస్.ఐ. పేర్కొన్నారు.



## కరాటేలో మణుగూరు క్రీడాకారిణులకు గ్లోబల్ అవార్డులు..

- **మాస్టర్ పద్మకు గ్లోబల్ మాస్టర్ నంది**
- **రిషిక, యామినికి గ్లోబల్ స్టార్ కిడ్ పురస్కారాలు..**

**మణుగూరు, మహా :** కరాటే రంగంలో ప్రతిభ కనబరుస్తున్న మణుగూరుకు చెందిన క్రీడాకారిణులు గ్లోబల్ అవార్డులు అందుకున్నారు. ఆదివారం కేతెదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఐకాన్ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో మణుగూరుకు చెందిన సీనియర్ లేడీ కరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ (బ్లాక్ బెల్ట్ 4వ డాన్) ఐకాన్ గ్లోబల్ మాస్టర్ నంది అవార్డును అందుకున్నారు. అదేవిధంగా గుగులోత్ రిషిక (బ్లాక్ బెల్ట్ 1వ డాన్), జక్కం యామిని (బ్లాక్ బెల్ట్ 1వ డాన్) ఐకాన్ గ్లోబల్ స్టార్ కిడ్ అవార్డులను కైవసం చేసుకున్నారు. కరాటేలో సాధన కొనసాగిస్తూ అవార్డులు సాధించిన రిషిక, యామినిని మాస్టర్ పద్మతో పాటు వారి తల్లిదండ్రులు అభినందించారు. కరాటేలో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు విద్యార్థులకు నిరంతరం శిక్షణ అందిస్తున్నట్లు మాస్టర్ కాశిమల్ల పద్మ తెలిపారు.



## సింగరేణిలో ఖాళీ పోస్టుల భర్తీకి వ్రాత పరీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఫిట్టర్ ట్రైనీ కేటగిరీ 1 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసేందుకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ పిజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. ఫిట్టర్ ట్రైనీ కేటగిరీ 1 96 ఖాళీలకు గాను అర్హులయిన 84 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా 72 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ వ్రాత పరీక్ష విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణలో సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించటం జరిగింది. ఈ పరీక్షను జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధర రావు, జిఎం(విజిలెన్స్) ఎస్.వి.మురళీధర రాజు పర్యవేక్షించి పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు సింగరేణి వెబ్ సైట్ సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో ఏజిఎం(పర్సనల్) పి.వేణు గోపాల రావు, డిజిఎం(పర్సనల్) బి.సమ్మయ్య, డివైపిఎం డి.నాగేశ్వర రావు, విజిలెన్స్ ఆఫీసర్ ఎండి.గౌసుద్దీన్, మహిళా డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.మంజుల ఇతర అధికారులు, విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది రిక్రూట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహిళ శవం కలకలం

- అనుమానస్పదమా...? అనారోగ్యమా....?
- నాలుగురోజులైనా స్పందించని బంధువులు.
- దుర్వాసన వెదజల్లడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు.
- రంగంలోకి పోలీసులు.



**దమ్మపేట ,మహా :** మండలంలో ఓ మహిళా మృతదేహం కలకలం రేపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,మండల కేంద్రం శివారులో ఉన్న ఓ దాబా హోటల్ ఎదురుగా ఉన్న కాలనీలో ఓ మహిళా మృతదేహం దుర్వాసన వెదజల్లుతుండటంతో అనుమానం వచ్చిన స్థానికులు కొందరు పోలీసుల కు సమాచారం అందించినట్లు తెలుస్తుంది. వెంటనే సంఘటనా ప్రదేశానికి చేరుకున్న పోలీసులు స్థానిక గౌతమ్ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారం తో మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. అప్పటికే మృతి చెంది దాదాపుగా నాలుగైదు రోజులు కావస్తుండటంతో మహిళ మృతదేహం దుర్వాసన వెదజల్లుతో భయంకర స్థితిలో ఉండటాన్ని గమనించారు. సమీప దూరపు భంధువుల ఫిర్యాదు మేరకు యస్ఐ రాజేష్ కుమార్ కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

**అనుమానమా....? అనారోగ్యమా....?**
స్థానికుల సమాచారం మేరకు మృతురాలు కౌలూరి రంగమ్మ ,దాదాపుగా 53 సంవత్సరాల వయస్సు తో ఒంటరిగా జీవనం సాగిస్తుంటది .ఈమె ప్రస్తుతం అశ్వారావుపేట లో మిషన్ భగీరథ సెక్టార్ లో ఉద్యోగ భాద్యతలు చేస్తున్నట్లు సమాచారం ఉండగా ,ఆమెకు అనారోగ్య కారణంగా ఆమె స్థానంలో ఇదే మండలానికి చెందిన వేరే వ్యక్తి సదరు ఉద్యోగ భాద్యతలు చేస్తున్నట్లు సమాచారం. ఐతే ఆమె అనారోగ్యంతో , మానసిక ఒత్తిళ్ళతో ఒంటరిగా నివసిస్తుండటంతో దూరపు భంధువులతో కూడా అంతగా సంభంధాలు లేకపోవడంతో మృతి చెందిన విషయం గమనించక పోయి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పోలీసులు రంగంలోకి : ఘటనా ప్రదేశం లో మృత దేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట కు తరలించారు. భంధువుల ఫిర్యాదు మేరకు ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం వివరాలను పరిశీలించిన తదుపరి అనుమానమా ...లేక అనారోగ్యం తో మృతి చెంది ఉంటుందా అనే విషయాలను పోలీసులు తేల్చాల్సి ఉంటుంది.

# యువతి అనుమానాస్పద మృతి కేసు ఛేదించిన పోలీసులు

- కాంట్రాక్ట్ అధ్యాపకుడు ప్రధాన నిందితుడు.. మరో వ్యక్తి అదుపులో
- సీసీ కెమెరాలు, కాల్‌డేటాతో గుట్టురట్టు..
- కారు, ఫోన్లు, ట్యాబ్ స్వాధీనం




**పెద్దపల్లి మహా, :** గోదావరిఖని: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న జెట్టి నవీన్ కుమార్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు, సింగరేణి సంస్థలో ఓవర్‌మన్‌గా పనిచేస్తున్న బొమ్మకంటి రవికుమార్‌ను ఓసీపీ05 గని వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, పెద్దపల్లి డీసీపీ పర్యవేక్షణలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా దృశ్యాలు, కాల్‌డేటా, కాల్ రికార్డులు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుల కదలికలను గుర్తించినట్లు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2022లో పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న యువతితో నవీన్ కుమార్‌కు పరిచయం ఏర్పడింది. అనంతరం అది సన్నిహిత సంబంధంగా మారినట్లు తెలిపారు. యువతి డిప్లొమా పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీటెక్ మైనింగ్ చదువుతున్న సమయంలో శిక్షణ కోసం గోదావరిఖనికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో ఆమెకు రవికుమార్‌తో పరిచయం ఏర్పడిందని తెలిపారు. యువతి రవికుమార్‌తో సన్నిహితంగా మెలగడాన్ని నవీన్ కుమార్ తట్టుకోలేక ఆమెపై ఆగ్రహం పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో యువతిని హత్య చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 12న శనివారం రోజున పురుగుల మందును నీటి సీసాలో నింపుకుని కారులో ఉంచుకున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్స్ వద్ద ఆటోలో వెళ్తున్న యువతిని కారులో ఎక్కించుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో కారులో తిప్పుతూ ఆమెతో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. రవికుమార్ తనపై అత్యాచారం చేశాడని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొంటూ యువతితో సూసైడ్ నోట్ రాయించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమెతో పురుగుల మందు తాగించినట్లు ఆరోపించారు. యువతి స్పృహ కోల్పోయినప్పటికీ వెంటనే ఆసుపత్రికి తరలించకుండా జాప్యం చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె మొబైల్ నుంచి తండ్రికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు. రాత్రి యువతిని ఇంటికి తీసుకెళ్లి, ఆమె తల్లిదండ్రులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ యువతి మరుసటి రోజు మృతి చెందినట్లు వెల్లడించారు. యువతి మృతి అనంతరం ఆధారాలు మాయం చేసేందుకు కారును కడిగినట్లు, సూసైడ్ నోట్, పురుగుల మందు సీసా, సిమ్ కార్డులను తొలగించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లినట్లు గుర్తించారు. ఈ కేసులో ఏ1గా జెట్టి నవీన్ కుమార్, ఏ2గా బొమ్మకంటి రవికుమార్‌ను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి ఎకోస్పోర్ట్ కారు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసులో రవికుమార్ పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## ఖర్చెంతైనా బాధ్యత నాదే..

**రహీమున్నీసా బేగం ఆరోగ్యానికి ఎమ్మెల్యే నాయిని భరోసా**

హనుమకొండ, మహా ; జీవితం మొత్తం తెలంగాణ ఉద్యమానికి అంకితమైన ఉద్యమకారిణి అని ఉద్యమ సమయంలో ప్రజల కోసం, సమాజం కోసం ముందుండి పోరాడిన ఉద్యమకారిణి రహీమున్నీసా బేగం ఇప్పుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆమెను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రస్తుతం ఆమె ఊపిరితిత్తుల సమస్యతో హనుమకొండలోని ఏకశిలా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహీమున్నీసా బేగం ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఆమె చికిత్సకు ఖర్చెంతైనా పర్వాలేదు నేను భరిస్తానని మెరుగైన వైద్యం అందించడం మన బాధ్యత అని రహీమున్నీసా బేగం ఆరోగ్యం కోసం అవసరమైన సహాయం అందిస్తాను అని ఎమ్మెల్యే నాయిని భరోసా ఇచ్చారు.ఆమె తన జీవితాన్ని కుటుంబం కంటే సమాజానికి, ప్రజల కోసం అంకితం చేసిన రహీమున్నీసా బేగం వంటి ఉద్యమకారిణి కష్టకాలంలో ఒంటరిగా ఉండకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే నాయిని ఆమె కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. మీ కుటుంబానికి నేను ఉన్నాను.. ధైర్యంగా ఉండండి అంటూ వారికి భరోసా కల్పించారు. రహీమున్నీసా బేగం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు.



## మహమ్మద్ సేట్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ..

**మృతికి సంతాపం తెలిపిన పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త మహమ్మద్ సేట్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరులోని మహమ్మద్ సేట్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహమ్మద్ సేట్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి, జిల్లా నాయకుడు దొబ్బల వెంకటప్పయ్య, శివ సైదులు, జీవి, రాష్ట్ర నాయకుడు సామా శ్రీనివాస రెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, సర్పంచ్ కలబోయిన మాధవరావుతో పాటు ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యెల్లారెడ్డిగూడలో ఘోర రోడ్డు ప్రమాదం

- స్కూటీ అదుపుతప్పి టిప్పర్ వెనుక భాగంలో పడిన ఇద్దరు.. విద్యార్థులు . అక్కడికక్కడే మృతి




**కుషాయిగూడ, మహా:** యెల్లారెడ్డిగూడలో శనివారం .రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్ పూజ కార్యక్రమానికి వెళ్తున్న స్కూటీ అదుపుతప్పి మట్టి తరలిస్తున్న టిప్పర్ వెనుక భాగంలో పడటంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కాప్రా ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల విద్యార్థిని మార్తాల వెంకట దీపశిఖా రెడ్డి, యెల్లారెడ్డిగూడకు చెందిన 15 ఏళ్ల గంధం అమర్త్య కలిసి యాక్టివా స్కూటీపై శాలివాహన ఎన్‌క్లేవ్ వైపు వెళ్తుండగా రాయల్ ఇరానీ కేఫ్ సమీపంలో రోడ్డుపై ఉన్న మట్టి కుప్పను తప్పించే క్రమంలో స్కూటీ అదుపుతప్పినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో కాప్రా నుంచి యెల్లారెడ్డిగూడ వైపు మట్టి తరలిస్తున్న టిప్పర్ వెనుక భాగంలో ఇద్దరూ పడిపోయారు. టిప్పర్ వెనుక టైర్లు దీపశిఖా రెడ్డిపై నుంచి వెళ్లగా, అమర్త్యకు తీవ్ర తలకు గాయం అయినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరూ ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. టిప్పర్‌ను నడుపుతున్న బలాజీనగర్‌కు చెందిన గుంజ నర్సింహాపై బీఎన్ఎస్ సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తును ఎస్ఐ ఆర్. రామకృష్ణ చేపట్టారు.



# ఏటీఎం చోరీకి పక్కా స్కెచ్!

- ఏడు లక్షల నగదు చోరీ.. కెమెరాలపై బ్లాక్ స్ప్రే.. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం ధ్వంసం

**తిమ్మాపూర్, మహా:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఎస్బీఐ ఏటీఎంను నలుగురు దుండగులు పక్కా ప్రణాళికతో టార్గెట్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తిమ్మాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోని రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఏటీఎంలో అర్ధరాత్రి చోరీ జరిగింది. బ్లాక్ స్కార్పియోలో వచ్చిన దుండగులు ముందుగా ఏటీఎంలోని సీసీ కెమెరాలపై బ్లాక్ స్ప్రే కొట్టి వాటిని నిర్వీర్యం చేసినట్లు తెలుస్తోంది. అనంతరం గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. చోరీలో నలుగురు పాల్గొన్నట్లు, వారిలో ఒకరు మహిళా దుస్తులు ధరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించినట్లు సమాచారం. చోరీకి ఉపయోగించిన స్కార్పియోకు ఫేక్ నంబర్ ప్లేట్ అమర్చినట్లు తెలుస్తోంది. ఆ నంబర్ మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన మరో వాహనానికి సంబంధించినదిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దీంతో అసలు వాహనం ఎక్కడి నుంచి వచ్చిందన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎం పరిసరాలతో పాటు రాజీవ్ రహదారిపై ఉన్న ఇతర సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.ఏటీఎంలో రూ.7.13 లక్షల నగదు చోరీ అయినట్లు సీఎంఎస్ సంస్థ సిబ్బంది తెలిపినప్పటికీ, చోరీ సమయంలో అంత మొత్తం నగదు ఉందా అనే అంశంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. నగదు లోడింగ్ రికార్డులు, లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నారు. ఇదే సమయంలో దుర్షేడ్ ప్రాంతంలో జరిగిన ఏటీఎం చోరీతో ఈ ఘటనకు సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. గ్యాస్ కట్టర్ వినియోగం, కెమెరాలపై స్ప్రే, ఫేక్ నంబర్ వాహనం వంటి అంశాల ఆధారంగా పాత ఏటీఎం చోరీ ముఠాల కదలికలపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కరీంనగర్ డీసీపీ వెంకటరమణ, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ తదితర అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

## డాక్టర్ ఏఎస్ రావు 112వ జయంతి సందర్భంగా సంస్మరణ

- స్ఫూర్తి గ్రూప్, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం.. మెడికల్ క్యాంపు నిర్వహణ



**కుషాయిగూడ, మహా:** పద్మభూషణ్ డాక్టర్ ఏఎస్ రావు 112వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కమలానగర్ సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యుడు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ రిటైర్డ్ అధికారులు, స్ఫూర్తి గ్రూప్ నాయకులు ఎం. భాస్కర్ రావు, హెచ్.వి. స్వామి డాక్టర్ ఏఎస్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు సభ్యులు పూలు సమర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన డాక్టర్ ఏఎస్ రావు విద్యపై ఆసక్తితో ఉన్నత విద్యను అభ్యసించి దేశ స్వావలంబనకు కృషి చేశారని తెలిపారు. హైదరాబాద్‌లో ఈసీఐఎల్ పరిశ్రమ ఏర్పాటుకు ఆయన చేసిన కృషి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడిందన్నారు. పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ ఈసీఐఎల్ ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని, డాక్టర్ ఏఎస్ రావు నిరాడంబర జీవితం గడుపుతూ సమాజానికి సేవ చేశారని తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా సెప్టెంబర్ 21న సాయి సుధీర్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎం. భాస్కర్ రావు మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు సేవలను స్మరించుకుంటూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఏఎస్ రావు నగర్ సీనియర్ సిటిజన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో శారద, వెంకటేశ్వరరావు, సునీల్, బీడీఎల్ సత్యానారాయణ, రుక్కయ్య, అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. హెచ్.వి. స్వామి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



## విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బండారి

**హెచ్‌బీ కాలనీ ఫేజ్-1లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 20వ యజ్ఞ మహోత్సవం**

కుషాయిగూడ, మహా : శ్రీ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని హెచ్‌బీ కాలనీ డివిజన్ ఫేజ్ 1 గ్రౌండ్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం కాప్రా సర్కిల్ ఆధ్వర్యంలో 20వ యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు, యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో ప్రజలందరూ శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. విశ్వబ్రాహ్మణుల సంప్రదాయాలు, కళలు, వృత్తి నైపుణ్యాలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, బిఆర్ఎస్ నాయకులు . తెలంగాణ ఉద్యమకారుడు. వంజరి ప్రవీణ్ కరిపే . బిజెపి మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు భాగవతుల శశికళ .విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి మల్లికార్జున, చైర్మన్ కేసోజు లక్ష్మీనారాయణ చారి, యజ్ఞ కమిటీ అధ్యక్షుడు సద్గుణ చారి, కేసోజు శ్రీనివాస చారి, సమ్మని మురళీ చారి, శ్యాంసుందర్ చారి, సమ్మని సత్యనారాయణ చారి, మునుగంటి రాంప్రదీప్, అమ్మనబోలు శ్రీనివాస చారి, బ్రహ్మచారి, పాండు చారి, శంకర్, వెంకటాద్రి, వాసుచారి, భీష్మ చారి, పవన్ చారి, విష్ణు చారి, మల్లేష్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రీయ దృక్పథానికి ప్రతీక డాక్టర్ ఏ.ఎస్.రావు

- జెవివి రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు
- జన విజ్ఞాన వేదిక కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

**కుషాయిగూడ, మహా:** ప్రముఖ శాస్త్రవేత్త, ఈసీఐఎల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ ఏ.ఎస్.రావు శాస్త్రీయ ఆలోచనలకు, సాంకేతిక స్వావలంబనకు ప్రతీకగా నిలిచారని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక కీసర మండల కమిటీ ప్రథమ సమావేశం రాంపల్లి చౌరస్తాలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.ఎస్.రావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు మాట్లాడుతూ.. దేశ ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధికి డాక్టర్ ఏ.ఎస్.రావు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారత అణుశక్తి, ఎలక్ట్రానిక్స్ పరిశోధన రంగాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈసీఐఎల్ స్థాపన ద్వారా దేశ సాంకేతిక స్వావలంబనకు బలమైన పునాదులు వేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారన్నారు.నేటి యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని, మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పరిశోధనాత్మక ఆలోచనలు, విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంపొందించుకోవడం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. డాక్టర్ ఏ.ఎస్.రావు ఆశయాలను భావితరాలు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశానికి కీసర మండల కమిటీ అధ్యక్షుడు నవీన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక కీసర మండల కమిటీ ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, సభ్యులు నర్సింహా, కృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

# ఆత్మహత్యలకు కేరాఫ్ గా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్

- డీజిల్ పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నం
- భార్యాభర్తల పంచాయతీ పై ఇరువర్గాల పిటిషన్
- మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ లో ఇది రెండో ఘటన




**వరంగల్, క్రైం మహా;** వరంగల్ సబ్ డివిజన్ లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు ఆత్మహత్యలతో కూడిన అగ్నిగండం పొంచి వున్నట్లుగా ఉందో ఏమో అని స్థానికులు చెబుతున్నారు. భార్యాభర్తల పంచాయతీలో భాగంగా ఇరువర్గాలు పిటిషన్ ఇవ్వగా ఆ వ్యక్తి స్టేషన్ ఆవరణ లోనే డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇటీవల కాలంలో మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ లో ఇది రెండో ఘటన. వివరాల్లోకెళ్తే..వరంగల్ ఉర్సు ప్రాంతానికి చెందిన భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదం పై ఇరువర్గాలు మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ లో పిటిషన్లు ఇచ్చారు. ఈ క్రమంలో అనూప్ అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటి పై డీజిల్ పోసుకోవడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. స్పందించిన పోలీసులు నీళ్లు పోసి ప్రమాదాన్ని నివారించి, అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.భార్యాభర్తల మధ్య సమస్య పై ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీస్‌స్టేషన్ వద్ద ఇలాంటి చర్యలకు పాల్పడటం మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రెండో ఘటనగా పోలీసులు పేర్కొంటున్నారు.

**సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలి**
ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయాలని వాటిని చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. సమస్యలు రాగానే ఆత్మహత్యకు పాల్పడడం, బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యల ద్వారా న్యాయం పొందలేరని పోలీసులు సూచించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న కొత్త చట్టాల ప్రకారం ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని మిల్స్ కాలనీ పోలీసులు తెలిపారు. ముఖ్యంగా ప్రజల ఆలోచనా విధానం మారాలని ఇందుకు చట్టాల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.







## కన్నడ స్టార్ విజయ్ రాఘవేంద్ర హీరోగా దర్శకుడు సంజీవ్ మేగోటి మూవీ

# ఆన్ డ్యూటీ

**హైదరాబాద్:** క్రైమ్, యాక్షన్, థ్రిల్‌తో కూడిన విభిన్న కథలను తెరపై ఆవిష్కరించడంలో తనదైన ముద్ర వేసుకున్న క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగులో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన 'పోలీస్ కంప్లైంట్' మూవీతో హిట్ కొట్టిన ఆయన.. ఇప్పుడు కన్నడలో తన అప్‌కమింగ్ మూవీ రూపొందించబోతున్నారు. 'ఆన్ డ్యూటీ' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ మూవీ కన్నడ కంఠీరవ డాక్టర్ రాజ్‌కుమార్ కుటుంబానికి చెందిన ప్రముఖ హీరో విజయ్ రాఘవేంద్ర కథానాయకుడిగా నటించనున్నాడు. ఇప్పటికే క్రైమ్, సస్పెన్స్, యాక్షన్ జానర్‌లో పలు విభిన్న చిత్రాల్లో నటించిన విజయ్ రాఘవేంద్ర.. సంజీవ్ మేగోటి చెప్పిన ఈ సరికొత్త కథకు ఓకే చెప్పడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. విజయ్ రాఘవేంద్ర ఫిల్మోగ్రఫీలో కూడా క్రైమ్, థ్రిల్లర్, యాక్షన్ కథలు కనిపిస్తాయి. విజయ్ రాఘవేంద్ర ఇటీవల నటించిన 'సెకండ్ కేస్ ఆఫ్ సీతారాం' (Second Case of Seetharam) మూవీ ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతూ సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఇక క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించిన 'పోలీస్ కంప్లైంట్' మూవీ సినిమా క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలతో రూపొంది సూపర్ హిట్ అయింది. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో రూపొందిన 'పోలీస్ కంప్లైంట్'కు థియేటర్‌లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా అమెజాన్ ప్రైమ్‌లో కూడా ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో ఇటీవల తమతమ సినిమాలతో సూపర్ హిట్ కొట్టిన హీరో విజయ్ రాఘవేంద్ర, డైరెక్టర్ సంజీవ్ మేగోటి కలిసి రూపొందించబోయే ప్రాజెక్టు ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ హిట్ కాంబినేషన్‌పై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి. పుష్కర కాలం విరామం తర్వాత కన్నడ చిత్ర పరిశ్రమలో మళ్లీ దర్శకత్వం వహిస్తున్న సంజీవ్ మేగోటి, ఈసారి క్రైమ్ అండ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో సరికొత్త కథాంశంతో సినిమా తెరకెక్కించనున్నారు. మరింత భారీ స్థాయిలో, కొత్త కథనం, విభిన్న స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించేందుకు ఈ క్రియేటివ్ డైరెక్టర్ సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు ప్రేక్షకులు చూసిన కథలకు భిన్నంగా, నెవర్ బిఫోర్ అనే రీతిలో కొత్త స్క్రీన్‌ప్లేతో ఈ చిత్రాన్ని రూపొందించేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. విజయ్ రాఘవేంద్ర వంటి స్టార్ హీరో.. సంజీవ్ మేగోటి వంటి విభిన్న కథలను తెరకెక్కించే దర్శకుడు.. క్రైమ్ అండ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్.. సరికొత్త స్క్రీన్‌ప్లే.. ఈ కాంబినేషన్‌పై కన్నడ సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాణ సంస్థ తదితర వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## తెల్లచీరలో మెరిసిన కీర్తి సురేష్

తెలుగు, తమిళ, మలయాళ చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన నటి కీర్తి సురేష్ తాజాగా సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. స్వచ్ఛమైన తెల్లని చీరలో బంగారు రంగు ఎంబ్రాయిడరీతో ఆమె కనిపించిన ఫొటో ప్రస్తుతం అభిమానులను ఆకర్షిస్తోంది. చీర కొంగు, బ్లౌజ్‌పై ప్రత్యేకమైన డిజైన్ ఉండగా.. చేతి భాగంలో అరచెట్టు, అలల ఆకృతులతో రూపొందించిన బంగారు రంగు పనితనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయానికి ఆధునిక అందాన్ని జోడించేలా కీర్తి సురేష్ ఈ లుక్‌ను తీర్చిదిద్దుకున్నారు. మెడలో సంప్రదాయ బంగారు చోకర్, చెవులకు జుంకాలు, చేతులకు బంగారు గాజులతో ఆమె అలంకరించుకున్నారు.





## రూ.500 షో నుంచి.. 'ప్యారడైజ్' టికెట్ ప్లాన్!

హైదరాబాద్, మహా: నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా టికెట్ ధరలపై కొంతకాలంగా సాగుతున్న చర్చకు తెరపడింది. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 20న జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల్లో సినిమా టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోకు అనుమతి, థియేటర్లు పాటించాల్సిన నిబంధనలను స్పష్టంగా పేర్కొంది. సెప్టెంబర్ 23న సాయంత్రం 6.30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనకు ఒక్కో టికెట్‌ను రూ.500గా నిర్ణయించారు. ఈ ధరలో జీఎస్టీ కూడా కలిపి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాని సినిమాకు విడుదలకు ముందే ప్రత్యేక షోను ఈ స్థాయి టికెట్ ధరతో ప్రదర్శించేందుకు అనుమతి లభించడంతో తొలి షోలకు ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందన్న ఆసక్తి నెలకొంది.సెప్టెంబర్ 24 నుంచి సినిమా సాధారణ ప్రదర్శనలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 24 నుంచి 27 వరకు నాలుగు రోజుల పాటు పెంచిన టికెట్ ధరలు అమల్లో ఉంటాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ప్రస్తుత టికెట్ ధరపై రూ.48 వరకు అదనంగా వసూలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మల్టీప్లెక్స్‌లు, ప్రత్యేక థియేటర్లలో రూ.95 వరకు అదనపు ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ పెంపు రోజుకు ఐదు షోలకు వర్తిస్తుంది. దీంతో గురువారం నుంచి ఆదివారం వరకు తొలి వారాంతంలో 'ది ప్యారడైజ్' పెరిగిన టికెట్ ధరలతోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.వీకెండ్ ముగిసిన వెంటనే టికెట్ ధరలు పూర్తిగా సాధారణ స్థాయికి వచ్చేలా కాకుండా మరో దశలోనూ పరిమిత పెంపును ప్రభుత్వం అనుమతించింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.23, మల్టీప్లెక్స్‌లు, ప్రత్యేక థియేటర్లలో రూ.45 వరకు అదనపు ధర వసూలు చేసేందుకు అనుమతి ఇచ్చింది.తొలి నాలుగు రోజుల కంటే తక్కువ పెంపుతో ఈ రేట్లు మరో ఆరు రోజుల పాటు కొనసాగనున్నాయి. దీంతో మొదటి వారాంతం తర్వాత కూడా సినిమా టికెట్ ధరలు కొంత మేరకు పెరిగిన స్థాయిలోనే ఉండనున్నాయి.సినిమా టికెట్ ధరల పెంపుతో పాటు ప్రభుత్వం మరికొన్ని షరతులను కూడా విధించింది. 'ది ప్యారడైజ్' నిర్మాత శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కమిటీకి రూ.1 కోటి చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని సినీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాల్సి ఉంటుంది.థియేటర్లలో సామాజిక అవగాహన కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. డ్రగ్స్, నార్కోటిక్స్, సైబర్ క్రైమ్ వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రకటనలను సినిమా ప్రదర్శనల సమయంలో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించింది. ఈ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అనే అంశాన్ని జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత లైసెన్సింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించింది.ఇక సెప్టెంబర్ 23 ప్రత్యేక షోకు సంబంధించిన బుకింగ్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. రూ.500 టికెట్ ధరకు అనుమతి లభించినప్పటికీ అన్ని థియేటర్లలో అదే ధర అమలు చేస్తారా? లేక థియేటర్‌ను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయా? అనేది బుకింగ్స్ ప్రారంభమైన తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్ 24 నుంచి మల్టీప్లెక్స్‌లలో అదనంగా రూ.95 వరకు పెంచుకునే వెసులుబాటు ఉండటంతో ప్రైమ్ షోల టికెట్ ధరలు ఎంతవరకు చేరుతాయన్నదీ ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర నగరాలు, పట్టణాల్లో టికెట్ ధరలు వెల్లడైన తర్వాత 'ది ప్యారడైజ్'కు పెంచిన ధరల ప్రభావం ఎలా ఉంటుందన్నది తేలనుంది.

## బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన ఆలియా భట్

బాలీవుడ్ నటి ఆలియా భట్ 2012లో కరణ్ జోహార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. తొలి సినిమాతోనే యువ ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఆ తర్వాత వరుసగా విభిన్న కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనకు ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. 'హైవే', '2 స్టేట్స్', 'ఉడ్తా పంజాబ్', 'రాజీ', 'గల్లీ బాయ్', 'గంగూబాయి కాఠియావాడి' వంటి చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు నటిగా ఆలియా స్థాయిని మరింత పెంచాయి.విభిన్న భావోద్వేగాలను తెరపై సహజంగా ఆవిష్కరించే నటిగా ఆలియా భట్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ'తో మరో విజయాన్ని అందుకున్న ఆమె.. 2024లో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'జిగ్రా'లో ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా నిర్మాతగానూ వ్యవహరించారు. దీంతో నటనతో పాటు నిర్మాణ రంగంలోనూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.2026లో స్పై థ్రిల్లర్ 'ఆల్ఫా'లో ప్రధాన పాత్రలో కనిపించి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రస్తుతం రాబోయే రొమాంటిక్ కామెడీ చిత్రం 'డోంట్ బీ షై' నిర్మాణంలో ఆలియా భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 25, 2026న ప్రైమ్ వీడియో వేదికగా విడుదల కానుంది.ఇక ఆలియా చేతిలో మరికొన్ని భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్'లో రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్‌తో కలిసి ఆమె నటిస్తున్నారు. ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు 'తుంబాద్ 2'లోనూ ఆమెకు సంబంధించిన ప్రాజెక్ట్ కొనసాగుతోంది.కెరీర్ ప్రారంభంలో యువ కథానాయికగా పరిచయమైన ఆలియా భట్.. అంచెలంచెలుగా విభిన్న పాత్రలు, ప్రయోగాత్మక కథలను ఎంచుకుంటూ బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ కొనసాగుతూ సినిమాకు సంబంధించిన పలు విభాగాల్లో తన ప్రతిభను చాటుతున్నారు.





## సత్యం వెనుక కదిరి కాళిదాస్!

హైదరాబాద్, మహా: మెగాస్టార్ చిరంజీవి, మాస్ దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో ఈ ఇద్దరి కలయికలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' విజయాన్ని అందుకోవడంతో కొత్త సినిమాపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. తాజాగా ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించి చిరంజీవి వెల్లడించిన కొన్ని వివరాలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పైకి కనిపించే వ్యక్తిత్వానికి, అతడి గత జీవితానికి మధ్య భారీ వ్యత్యాసం ఉంటుందని చిరంజీవి ఇచ్చిన హింట్స్ కథపై ఆసక్తిని పెంచుతున్నాయి.ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి.. సినిమాలో తన పాత్ర పేరు 'కదిరి కాళిదాస్' అని వెల్లడించారు. దీంతో ఈ పాత్ర చుట్టూ అనేక ఊహాగానాలు మొదలయ్యాయి. సినీ వర్గాల్లో ప్రచారంలో ఉన్న కథనాల ప్రకారం.. సినిమాలో చిరంజీవి రెండు విభిన్న కోణాలతో కూడిన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు సాధారణ వ్యక్తిగా కనిపిస్తూనే.. మరోవైపు అతడి గతం వెనుక దాగి ఉన్న మరో శక్తివంతమైన వ్యక్తిత్వం కథలో కీలకంగా మారనుందని సమాచారం. కథనం ప్రకారం బయట ప్రపంచానికి చిరంజీవి పోషించే పాత్ర 'సత్యం'గా కనిపిస్తాడట. ఓ సాధారణ ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ, బాధ్యతగా కుటుంబాన్ని చూసుకునే వ్యక్తిగా ఆయన పాత్రను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. అయితే ఈ సాధారణ వ్యక్తి వెనుక 'కదిరి కాళిదాస్' అనే మరో కోణం దాగి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. గతంలో అండర్‌వరల్డ్‌లో ప్రభావం చూపిన వ్యక్తిగా ఉన్న కాళిదాస్.. ఆ జీవితాన్ని వదిలి సాధారణ సత్యంగా ఎందుకు మారాల్సి వచ్చింది? అనే ప్రశ్న చుట్టూనే కథ ప్రధానంగా సాగుతుందని సమాచారం. సినిమాలో యాక్షన్ అంశాలతో పాటు కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తండ్రీకూతుళ్ల అనుబంధం కథలో కీలక పాత్ర పోషించనుందని సమాచారం. మలయాళ నటి అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో కనిపించనున్నారు. మెడిసిన్ చదువుతున్న తన కుమార్తె భవిష్యత్తు కోసం తండ్రిగా చిరంజీవి పడే తపన, ఆమెను కాపాడేందుకు తీసుకునే నిర్ణయాలు కథలో భావోద్వేగాన్ని పెంచనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అండర్‌వరల్డ్‌తో సంబంధం ఉన్న గతాన్ని వదిలేసి సాధారణ జీవితాన్ని ఎంచుకున్న కదిరి కాళిదాస్.. చివరకు తన కూతురి కోసం మళ్లీ ఆ ప్రపంచంలోకి అడుగుపెట్టాల్సి వస్తుందా? అనే అంశం కథలో కీలక మలుపుగా నిలవనుందని తెలుస్తోంది. సత్యం, కాళిదాస్ అనే రెండు విభిన్న కోణాల మధ్య చిరంజీవి పాత్ర ఎలా ప్రయాణిస్తుందన్నది సినిమాకు ప్రధాన ఆకర్షణగా మారనుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్నట్లు చిత్రబృందం వర్గాలు వెల్లడిస్తున్నాయి. యాక్షన్ సన్నివేశాలతో పాటు కుటుంబ భావోద్వేగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ దర్శకుడు బాబీ కొల్లి సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి-బాబీ కలయికలో మరోసారి మాస్ ఎంటర్‌టైనర్ రావడంతో అభిమానుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034